






# వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

మంగళవారం 21, ఏప్రిల్ 2026 16 పేజీలు


# రైతు సంక్షేమమే కాంగ్రెస్ విధానం...

## నస్తూర్‌పల్లి బహిరంగ సభలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి

కాటారం, ప్రభాతవార్త : 'రైతు సంక్షేమం కాంగ్రెస్ పార్టీకి కేవలం నినా దం మాత్రమే కాదు.. అది మా విధానం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నస్తూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండో విడత 'రైతు భరోసా' నిధులను బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఘాటుగా స్పందించారు. 'ప్రజా పాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్ రెడ్డి అంటున్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వనంత మాత్రాన ప్రజా పాలన పోవాలా..?' అని ప్రశ్నించారు.

- బహిరంగ సభలో రైతుభరోసా రెండవ విడత నిధుల విడుదల
- పేదలకు సన్నబియ్యం ఇచ్చిన చరిత్ర ప్రజాపాలన ప్రభుత్వంది..
- ఫాంహౌజ్‌లో పడుకున్న పాపాల భైరవుడు అధికారంలోకి వస్తాడని కలలు కంటుండ్లు..!
- గత ప్రభుత్వం పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవు
- 21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వంది..
- జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనంత మాత్రానా ప్రజాపాలన పోవాలా..?
- ప్రజాపాలన ఎందుకు పోవాలో జీవన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి..
- 20లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. 20వేల డబుల్ ఇండ్లు ఇవ్వలేదు..
- తెలంగాణలో మళ్లీ గడీల పాలన రానేరాదు..

7లో



# చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు

## రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన 36వ వార్షికోత్సవ, గ్రాడ్యుయేషన్ ఫెస్ట్, కల్చరల్ కార్నివాల్ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. 36ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలో ఆదర్శ విద్యా సంస్థ అందిస్తున్న సేవలను అభినందించి, పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు.

2లో

### సుదనపల్లి గ్రామం

# ఆదర్శంగా నిలువాలి

- జిల్లా ఎస్పి శబరీష్



మహబూబాబాద్ రూరల్,ఏప్రిల్20,ప్రభాతవార్త: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం సుదనపల్లి గ్రామం రోడ్డుభద్రతకై హెల్మెట్ వాడకం, గ్రామ రక్షణకై సీసీ కెమెరాల ఏర్పాటు, గంజాయి నిర్మూలనతో యువత శ్రేయస్సుకు ప్రతీకగా నిలువనుందని జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు.

2లో

# రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు

**▸జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్..**

**▸తాడూర్‌లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

**తంగళ్ళపల్లి, ప్రభాతవార్త**



రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు అందించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన టెంట్, నీటి వసతి పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రైతుల సౌకర్యం కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఇతర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 239కొనుగోలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ పై ఇప్పటికే మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార శాఖ అధికారి, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించామని గుర్తు చేశారు. కొనుగోలుకు కావలసిన ఎలక్ట్రానిక్ యంత్రాలు, గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వేసవి నేపథ్యంలో రైతుల కోసం టెంట్లు, నీటి వసతి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగం, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, అఫ్జల్ బేగం, తహసీల్దార్లు విజయ ప్రకాష్ రావు, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**-కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**గొల్లపల్లి, ప్రభాతవార్త :**



విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ కార్యక్రమంలో భాగంగా గొల్లపల్లి మండలంలో నిర్వహిస్తున్న (పెగడపెల్లి) మహాత్మ జ్యోతి పూలే బీసీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఆహారం రుచి, నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డైట్ మెను అమలు, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ విధానం, వంట గదిలో నిర్వహణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంటశాలల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన పదార్థాలతోనే ఆహారం సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పాఠశాలల్లో మెనూ సమర్థవంతంగా అమలు కావాలని, విద్యార్థులకు సురక్షితమైన, శుభ్రమైన వాతావరణంలో భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంక్షేమ అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా విద్యాధికారి కె. రాము, బీసీ సంక్షేమాధికారి సునీత, తహసీల్దార్ మాజిద్, ఎంపీడీవో రవీంద్రరావు, మండల విద్యాధికారి చెరుకు రాజన్న, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సిర్సపల్లి వేస్ట్ ప్లాంట్‌పై పోరు

**-కలెక్టరేట్ ముట్టడితో దద్దరిల్లిన హుజురాబాద్...!**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**



హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో ప్రభుత్వం ప్రతిపాదించిన వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ (డంపింగ్ యార్డ్) చిచ్చు రేపుతోంది. తమ ఊరి దరిదాపుల్లో చెత్త ప్లాంట్ వద్దంటూ స్థానిక ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వేలాదిగా తరలివచ్చిన బాధితులు జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించడంతో ఉద్రిక్తత నెలకొంది. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద పోలీసులు నిరసనకారులను అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఆగ్రహించిన ప్రజలు రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వంపై నినాదాలు చేశారు. గడిచిన నెల రోజులుగా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్నా, ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంపై అఖిలపక్ష కమిటీ మండిపడింది. ప్లాంట్ వల్ల భూగర్భ జలాలు కలుషితమై వ్యవసాయం దెబ్బతినడమే కాకుండా... గాలి కాలుష్యంతో చిన్నారులు, వృద్ధులు క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. సారవంతమైన భూములను, పాడి పంటలకు నిలయమైన మా ప్రాంతాన్ని విషతుల్యం చేయవద్దని, పట్టణ వ్యర్థాలను గ్రామాలపైకి నెట్టడం భావ్యం కాదని అఖిలపక్ష కమిటీ నాయకులు అన్నారు. తక్షణమే ఈ ప్లాంట్ ప్రతిపాదనను విరమించుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు వలకల ఈశ్వర్ రెడ్డి, గుడిపాటి జైపాల్ రెడ్డి, సర్పంచ్ మల్లారెడ్డి, బీజేపి పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు స్వంత ఇంటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం


**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**చందుర్తి ప్రభాతవార్త:** నిరుపేదలకు స్వంత ఇంటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు, సోమవారం చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్దిదారులకు గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేసి నూతన వస్త్రాలను అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతో ముందుకు పోతున్నామని తెలిపారు.. ఆడతల్లులకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నం బియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు మంజూరు, ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పిటీసి నాగం కుమార్ పాల్గొన్నారు.

# మరిమడ్లలో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

**ప్రభాత వార్త కోనరావుపేట:**






మరిమడ్ల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు జేఈఈ మెన్స్‌లో 7 గురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు పదవ తరగతి సి బి ఎస్ ఇ లో 57 మంది విద్యార్థులు కు 100శాతం ఉత్తీర్ణులయ్యారు అని పాఠశాల ప్రిన్సిపాల్ రామ్ సూరజ్ యాదవ్ అన్నారు పదవ తరగతిలో భూక్య రోహిత్ 89.80 శాతం, రాహుల్89.20శాతం, అఖిల్ 87.40 శాతంతో ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏకలవ్య గురుకుల పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ నాణ్యమైన భోజనం విద్యార్థినీ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తూ ఉన్నామని త్వరలోనే పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రకటనలు చేసిన తర్వాత ఆన్లైన్ అప్లికేషన్ చేసుకోవాలని అన్నారు

# కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**



రైతులు కష్టపడి పండించిన పంటకు సరైన ధర లభించేలా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యాన్ని తరుగు పేరుతో అధికారులు ఇబ్బంది పెట్టరాదని, అనవసరంగా కోతలు విధించకుండా న్యాయంగా కొనుగోళ్లు జరపాలని కోరారు. రైతులు మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని, తూకం, హమాలీ, రవాణా, చెల్లింపుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వానికి ఆయన సూచించారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 22న బుధవారం పెద్దపల్లి జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో అండర్7, అండర్11 ఉమ్మడి కరీంనగర్ జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చదరంగ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గడ్డాల శ్రీనివాస్, బజ్జూరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో అండర్7 విభాగంలో పాల్గొనదలచిన క్రీడాకారులు జనవరి 1, 2019న గాని, ఆ తర్వాత గానీ జన్మించి ఉండాలని, అండర్11 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2015న గానీ, ఆ తర్వాత గానీ జన్మించి ఉండాలన్నారు. అట్టి క్రీడాకారులు ఈ నెల 22న బుధవారం ఉదయం 9 గం.లకు అమర్ చంద్ కళ్యాణ మండపం, రిక్రియేషన్ క్లబ్, పెద్దపల్లిలో తమ పేర్లను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. అండర్7లో నలుగురు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలు, అండర్11లో నలుగురు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలను ఎంపిక చేసి హైదరాబాద్ లో జరిగే స్టేట్ మీట్ కు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే వారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. క్రీడాకారులు చెస్ బోర్డులు, పావులు వెంట తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేసారు. మరిన్ని వివరాలకు జి. శ్రీనివాస్, సెల్: 9515342207, బజ్జూరి ప్రసాద్, సెల్: 8897536218, సూరజ్ సింగ్, సెల్: 8096659481లో సంప్రదించాలని సూచించారు.

# సంఘం రాష్ట్ర నాయకులను కలిసిన కురుమలు

**నర్సంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

నర్సంపేట డివిజన్ కురుమ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని రాష్ట్ర కార్యాలయంలో కురుమ సంఘం రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్సీ యగ్గె మల్లేశం, రాష్ట్ర అధ్యక్షులు క్యామ మల్లేశంలని నర్సంపేట బీరప్ప కురుమ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నర్సంపేట కురుమ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్నటువంటి కార్యక్రమాలను చూసి వాళ్ళు అభినందించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 500 పైచిలుకు సభ్యత్వాలు కలిగి 20 లక్షల రూపాయలతో నేడు



సంఘం నడుపుతున్న విధివిధానాలు, చేపడుతున్న కార్యక్రమాలను వారు అభినందించారు. రాష్ట్రంలో ఏ డివిజన్లో కూడా ఇటువంటి సంఘం లేదని కురుమలను ఐక్యం చేయడంలో నర్సంపేట సంఘం ముందుందని వారు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ఎప్పటికీ నర్సంపేట కురుమ కుల సంక్షేమ సంఘానికి అండగా ఉంటుందని, నర్సంపేటలో సంఘ కార్యాలయా నిర్మాణానికి సంఘం నుండి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట కురుమకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బుడగొండ బిక్షపతి, గౌరవ అధ్యక్షులు కోరేసుధాకర్, ఉపాధ్యక్షులు కోరే రాము, పోతురాజు బాబు, గౌరవ సలహాదారులు అమ్మరాజు, కోరే రాజేష్, అల్లి రవి, కదారి శివ, బుడగొండ రాజు మరియు ఓయూ జేఏసీ నాయకులు కోరే కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 12 నెలలుగా అందని వేతనం -కనుకరించని అధికారులు

### -ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు

**నర్సంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు పనికల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏడాది కాలం పాటు వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి నేటి వరకు వేతనాలు రాకపోవడంతో వేసవిలో ఎండలకు తట్టుకొని కూలీలకు పనులు కల్పించినప్పటికి తమ ఇబ్బందులను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. గత సంవత్సరం ఏప్రిల్లో నర్సంపేట మండలంలోని 8 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. ఆ గ్రామాలలో ఉపాధిహామి పనులు నిలిపి వేయడంతో 12 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల అనుభవం ఉన్న సీనియార్టీ కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి అవకాశం కోల్పోయే అవకాశం ఉన్నందున ఆ ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు ఉపాధి కల్పించేందుకు గ్రామాలను కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఎంపిడివో, ఏపీవో, కలెక్టర్లతో పాటు పీడీడీఆర్డీఏలకు వినతిపత్రాలు ఇచ్చారు. మున్సిపాలిటిలో కలిసిన గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను పొరుగున ఉన్న గ్రామపంచాయతీల్లో విధులు కల్పించాలని కోరారు. స్థానిక ఎంపిడివో మాత్రం కొంత మందికి అనుకూలమైన గ్రామాలను కేటాయించి మరికొంత మందికి పది నుంచి 14 కిలో మీటర్ల ఉన్న గ్రామాలను కేటాయించారని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు. దూరం ఉన్న గ్రామాలు అయినప్పటికి ఇబ్బందులు పడుతూ 12 నెలలుగా ఆ గ్రామాలలో ఉపాధిహామి పనులు కొనసాగించడంలో భాగంగా ప్లానింగ్ ప్రాసెస్ ద్వారా ప్రజలకు కావాల్సిన కొత్త పనులను వెతకడం నర్సరి మెయింటెనెన్స్ ఎన్ఎంఎంఎస్ ఆధారిత ఫేస్ రికాగ్నిజేషన్ యాప్ ద్వారా ఈ కేవైసి చేయించి పనులు మంజూరి చేయించి పనులు కల్పించడం జరుగుతుంది. ఉపాధిహామి విధులు నిర్వర్తిస్తు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు వేతనాలు ఇప్పించాలని ఎన్ని సార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేదని వాపోతున్నారు. జిల్లా స్థాయి అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులపై, రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులపై అసంబద్దమైన ఆరోపణలు చేసుకుంటూ తమకు గ్రామాలను కేటాయించడంలో ఆలస్యం చేయడం వల్ల తమకు అనుకూలంగా ఉన్న జీవో నెంబర్ 4 సైతం రద్దు చేశారు. జీవో నెంబర్ 4 ప్రకారం పెద్ద గ్రామ పంచాయతీలలో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించే అవకాశం ఉన్నందున అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ జీవో రద్దు చేయబడింది. కొత్తగ ఏర్పడ్డ ఐదు గ్రామ పంచాయతీలలో నాలుగు నెలలుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు చేయడం కుదరనప్పటికి పాత గ్రామ పంచాయతీలు అయిన ఇటుకాలపల్లి, ఇప్పల్ తండా, రాజుపేట గ్రామపంచాయతీలలో వేతనాలు చేసే అవకాశం ఉన్నప్పటికి అధికారులు పట్టిచుకోవడం లేదని వాపోతున్నారు. అనుకూలమైన గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు కొత్త గ్రామ పంచాయతీలు కావడం వల్ల ఫైనాన్షియల్ అప్రూవల్ రాదని వేతనాలు ఇవ్వడం ఇబ్బందిగా ఉంటుందని రాష్ట్ర స్థాయి అధికారులు చేతులెత్తేశారు. ఇట్టి విషయమై స్థానిక ఎమ్మెల్యే, ఎంపిల సూచనల మేరకు 11 నెలలుగా రాజుపేట, ఇప్పల్తండా, ఇటుకాలపల్లి గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను కొనసాగిస్తూ మిగతా వారిని పక్క మండలాల్లో విధులు నిర్వర్తించే విధంగా చూడాలని ఎంపిడివోను ఆదేశించారు. అయినప్పటికి అధికారులు ఉద్దేశ పూర్వకంగా రాష్ట్ర స్థాయి పంపే ఉత్తర్వులు లోపబూయిష్టంగా అసంబద్దంగా ఉన్నాయంటూ ఆలస్యం చేయడం జరుగుతుంది. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులతో కుమ్మక్కై వారితో ఆర్థిక లావాదేవీలు జరపడం వల్ల వారికి నర్సంపేట మండలంలోనే అనుకూలమైన గ్రామాలను కేటాయించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రామాలను కేటాయించే క్రమంలో కౌన్సిలింగ్ నిర్వహించడానికి బదులు ఐదుగురు జిల్లా స్థాయి అధికారులతో 11 నెలల తర్వాత మరో మారు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని, ఈ సంవత్సరం ఫిబ్రవరిలో కౌన్సిలింగ్ జరిగిప్పటికి అపాయింట్ మెటర్లు ఇవ్వకుండా మళ్లీ కౌన్సిలింగ్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వేతనాలు మంజూరి చేయిస్తే తమకు పర్మినెంట్గా పనులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని జాతీయ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం(సిఐటియు) నర్సంపేట మండల అధ్యక్షుడు నర్ర నాగరాజు కోరారు.

# వ్యాయామంతో శారీరక దృఢత్వం పెంపొందుతుంది

**నర్సంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల శారీరక దృఢత్వం పెంపొందుతుందని టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్ అన్నారు. సోమవారం ద్వారకపేట రోడ్డులో గల రాయ్ ఫిట్నెస్ స్టూడియో మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఫిట్నెస్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ వారు క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు ప్రైజ్ మనీ స్పాన్సర్ చేస్తూ టోర్నమెంట్ విజేతలకు నగదు, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ఉండటానికి క్రీడలు, వ్యాయామశాలల పాత్ర కీలకమని ఆరోగ్యకరమైన శరీరం ఉంటేనే ఆలోచనలు కూడా ఆరోగ్యంగా ఉంటాయని, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుం దన్నారు. యువత వ్యాయామశాలలను విడిచిపెట్టడం వల్లే డ్రగ్స్ వంటి అలవాట్ల వైపు మొగ్గు చూపుతున్నారని, అందుకే క్రీడా సంస్కృతిని పెంచడానికి ప్రత్యేక కార్యక్రమాలకు సహకారం అందిస్తూ ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. యువత సన్మార్గంలో నడవాలని బంగారు భవిష్యత్తును అందుపుచ్చుకోవాలని మన స్ఫూర్తిగా కోరుకున్నారు. జిమ్ చేయడం వలన ఫిట్నెస్ తో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపించడానికి ఎంతగానో దోహదపడుతుందని వారన్నారు. జిమ్ శిక్షణ కేవలం శరీరాన్ని దృఢంగా మార్చుకోవడమే కాకుండా, మనసును కూడా క్రమశిక్షణతో ఉంచుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. గెలుపోటములకంటే పోటీలో పాల్గొ



నడం ముఖ్యమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటడం గొప్పతనం అని తెలిపారు. రాయ్ ఫిట్నెస్ స్టూడియో మేనేజ్మెంట్ సభ్యులు వారిని శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోజిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ, 24వ వార్డు కౌన్సిలర్ బత్తిని రాజేందర్, యువ నాయకులు, స్పాన్సర్ శంకరభక్తుల శివకృష్ణ, వంకుడోత్ గోపాల్, భూక్య గణేష్, ధారావత్ రాజు సహకారాలు ఉప్పల శాలూ మ్, సైఫా సురేష్, తిరుమల్, కళ్యాణ్, బాదం రంజిత్, దేవోజు హేమంత్, చీకటి శివమణి పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

# భవాని ఎలక్ట్రికల్ స్కూటీ షోరూం ప్రారంభం

**నెక్కొండ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



నెక్కొండ పట్టణంలో నూతనంగా వైస్సార్ సెంటర్లో ఏర్పాటు చేసిన భవాని ఎలక్ట్రికల్ స్కూటీ షోరూంను సోమవారం నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఆవుల శ్రీనివాస్, కొనిజెటి బిక్షపతి, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివకుమార్, ఉపసర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, చల్లా శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్స్ రావుల మహిపాల్ రెడ్డి, తాల్లూరి నర్సింహా స్వామి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు దుడిమెట్ల రాజు, చల్లా రాగోతం రెడ్డి, కిషన్ రెడ్డి చల్లా పాపిరెడ్డి, గరికపాటి కృష్ణ రావు, మూసినా శ్రీనివాస్, మైనారిటీ నాయకులు షైక్ షబ్బీర్, మహ్మద్ అన్వర్, సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, వార్డ్ సభ్యులు రామరాపు శిరీష రాము, జెండా రవి, మోటం మోనిక కృష్ణ రాజు, యాట శ్రావణి వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్పీవీ వ్యాక్సిన్ టీకా బాలికలకు పంపిణి

**దుగ్గొండి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



బాలికలకు క్యాన్సర్ వ్యాది రాకుండా ముందస్తుగా హెచ్పీవీ వ్యాక్సిన్ వేయించాలని డా. కిరణ్రాజ్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల లోపు బాలికలకు హ్యూమన్ ఫాతిలోమా వ్యాక్సిన్ పంపిణి కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తుగా హెచ్వీపీ వ్యాక్సిన్ బాలికలకు వేయిస్తే గర్భాషయ, బ్రెస్ట్ రెజనల్ క్యాన్సర్ వ్యాది రాకుండా ఉంటుందన్నారు. ఈ వ్యాక్సిన్ తప్పకుండా బాలికలకు వేయిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటుందన్నారు. టీకాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. రాకేష్, సిహెచ్వో సలోమి, హెచ్ఈవో సాంబయ్య, హెచ్వి సంధ్యారాణి, స్టాఫ్ నర్సు సబిత, జ్యోతి, ఫార్మసిస్టు విజయలక్ష్మి, ఏఎన్ఎం కోమల, సునిత, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# ఎండలు పెరుగుతున్నాయి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**చెన్నారావుపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



ఎండలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండా లని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సరోజ సూచించారు. సోమవారం వరి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు, రైతు కూలీలకు, హమాలీ కార్మికులకు కొనుగోలు కేంద్రాలలో పని చేస్తున్న వారికీ ఎండ తీవ్రతల గురించి అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లే వారు, గొర్రెల కాపరులు, పశువుల కాపరులు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లే వారు కుడా మధ్యాహ్న ప్రయాణాలు చేయకుండా ఉదయం సాయంత్రం వేళల్లో వెళ్లాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఉప కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, హెల్త్ సూపర్ వైజర్ రామేల్, వైద్య సిబ్బంది లింగమూర్తి, సురేందర్, ఆశా కార్యకర్త అనిత తదితరులు పాల్గొన్నారు.




# రేపటి వరకు పాలిసెట్ దరఖాస్తు గడువు పెంపు..!

**-10వ తరగతి ఉత్తీర్ణులకు డిప్లొమా ప్రవేశాలకు అవకాశం**

కాటారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త


ప్రభుత్వ పాటిటెక్నిక్ కళాశాల

పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తు గడువు రేపటి వరకు పొడిగించినట్లు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొదట ఏప్రిల్ 20 వరకు ఉండగా, ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ పొడిగింపు చేసినట్లు వెల్లడించారు. కమీషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన ఈ పొడిగింపును ఆమోఆదించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నికన కాటారం ప్రధానాచార్యులు డాక్టర్ రాజ్‌కుమార్ సూచించారు. ఈ పొడిగింపుతో గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లోని విద్యార్థులకు పెద్ద ఊరటగా మారిందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్లు 9010222167, 8897530335, 9966205728లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాటారంలో సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రతి గర్భిణీ స్త్రీ రక్తహీనతకు దూరంగా ఉండాలి

**-ఆరోగ్యవంతమైన శిశువు జన్మించేలా జాగ్రత్త పడాలి**

**-మహదేవపూర్ సీడీపీఓ ఆర్.రాధిక రెడ్డి**

**-ములుగుపల్లి అంగన్‌వాడీలో ఉత్సాహంగా 'పోషణ్ పక్వాడ'**

మహముత్తారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలోని మహముత్తారం మండలం ములుగుపల్లి నరగామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషన్ పక్వాడ' కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ రాధిక రెడ్డి హాజరై మాట్లాడారు. చిన్న పిల్లల పోషణ, తల్లిపాల ప్రాముఖ్యత, తొలి వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు వివరంగా అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు బదులుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న బాల్య అభివృద్ధి, పోషకాహారం, పూర్వ పాఠశాల వంటి సేవలను పూర్తిగా ఉపయోగించుకోవాలని కూడా సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీ రక్తహీనత నుండి దూరంగా ఉండాలని, పౌష్టికాహారంతో పాటు ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా వాడి ఆరోగ్యవంతమైన శిశువును జన్మించేలా జాగ్రత్త పడాలని సూచనలు చేశారు. అలాగే ప్రతి కిషోర బాలిక కూడా అంగన్వాడీలో ఇచ్చే ఇనుము గుళికలను నిరంతరం వాడి రక్తహీనతను నివారించుకోవాలని వివరించారు. స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాల ఉపయోగంతో పౌష్టికమైన వంటకాలను ఎలా తయారు చేయాలో తల్లిదండ్రులకు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. జంక్‌ఫుడ్, ప్యాకెట్ ఆహారం వలన కలిగే అధిక నష్టం, పౌష్టికాహార లోపం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలపై హెచ్చరిస్తూ స్వచ్ఛమైన, స్థానిక పదార్థాలపై దృష్టి పెట్టాలని స్పష్టంగా చెప్పారు. వీహెచ్‌ఎస్ఎన్‌డీ సమయంలో పిల్లల అభివృద్ధి మైలురాళ్లను ప్రతి అంగన్వాడీ టీచర్ తల్లిదండ్రులకు స్పష్టంగా వివరించి సంరక్షణ అవగాహన కలుపుతున్నారు. ప్రీ స్కూల్‌కు ఉన్న ప్రాముఖ్యత, ప్రీ స్కూల్ అసెస్మెంట్ కార్డుల పంపిణీ, పాఠశాల సంసిద్ధత కోసం పిల్లలతో వివిధ ఆక్టివిటీస్, గ్రాడ్యుయేషన్ డే వంటివి కూడా ఈ కార్యక్రమంలో నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగరాణి ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ కార్యక్రమాల అవసరం, అంగన్వాడీలో అందుతున్న ఉచిత విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక రెడ్డి, సూపర్‌వైజర్ నాగరాణి, సర్పంచ్ పురుషోత్తం, ఉప సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శి పాగె లక్ష్మీ, వార్డు సభ్యుడు రమేష్, అంగన్‌వాడీ టీచర్లు వేముల ప్రమీల, కె.రాజసమ్మక్క, పి.స్వప్న, బి.లక్ష్మీ, హెల్పర్‌లు, ఆశావర్కర్ శ్రీలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక రెడ్డి


ప్రీ స్కూల్ అసెస్మెంట్ కార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

# కనుకునూర్ 8వ వార్డులో నూతన మోటర్ స్టార్టర్ ఏర్పాటు

మహముత్తారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త


బోర్ మరమ్మతులు చేపిస్తున్న దృశ్యం

కనుకునూర్ గ్రామపంచాయతీ 8వ వార్డులో కొత్త మోటర్ స్టార్టర్‌ను దిగుమతి చేసి ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాల మేరకు మరమ్మతు పనులను చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ సుమలత, 8వ వార్డు సభ్యురాలు పొడెం సరిత, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ తోలం వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మారబోయిన లక్ష్మణ్, గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలు పొడెం బుచ్చక్క, కాంగ్రెస్ నాయకులు మారబోయిన కృష్ణ, బొడిగ రమేష్, కురుసం నరేష్, రేగ శ్యాం కుమార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బసవేశ్వరుని ఆశయాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

**-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**-ఘనంగా మహత్మ బసవేశ్వర 892వ జయంతి వేడుకలు**

ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి బ్యూరో


పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై, మహాత్మ బసవేశ్వర జీవితం, సూత్రాలు, సమానత్వం మరియు సామాజిక న్యాయం పై చేసిన కృషిని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, బిసి సంక్షేమ అధికారిణీ ఇందిర, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్, బీసీ సంఘాల ప్రతినిధులు కంపాటి రాజయ్య, మాటూరి శ్రీనివాస్, రుద్రశెట్టి యుగేందర్, మాటూరి మంజుల, శివ దర్శనం, సతీష్ తదితరులు మరియు జిల్లాలోని వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులను ఖండించిన ప్రజాసంఘాల నాయకులు

మహముత్తారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త


అరెస్ట్ అయిన ప్రజాసంఘాల నాయకులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలీసులు చేపట్టిన ముందస్తు అరెస్టులను ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైన ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని అన్నారు. ప్రజలు తమ సమస్యలను శాంతియుతంగా తెలియజేయడం రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కును హరించేలా పోలీసులు వ్యవహరించడం సరికాదన్నారు. సీఎం పర్యటన పేరుతో ప్రజాసంఘాల నాయకులను ఇంట్ల వద్దనే నిర్బంధించడం, స్టేషన్లకు తరలించడం, బెదిరింపులకు పాల్పడడం అన్యాయమని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ప్రశ్నలు జిల్లాలో నిరుద్యోగం, భూ సమస్యలు, రేషన్, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలపై ప్రశ్నించే వారిని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలిపారు. ప్రభుత్వం ప్రజల గళాన్ని వినాలి గానీ, పోలీసు నిర్బంధాలతో అణచివేయకూడదన్నారు. అదుపులోకి తీసుకున్న ప్రజాసంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, కులవ్యక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్, దళిత బంధు సాధన కమిటీ జిల్లా నాయకులు బొబ్బిలి వెంకటి, సంతకం లక్ష్మయ్య, జాడి రాజబాబు, బిజెపి మండల అధ్యక్షుడు మేడిపల్లి పున్నం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గూగుల్ వంశీ నాయక్, దుర్గం శ్రీశైలం నేత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాకవి మిట్టపల్లి సురేందర్‌ను కలిసిన కాళేశ్వరం ఉపసర్పంచ్ చెమ్మాల సుధీర్

మహదేవపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

తెలంగాణ మట్టి వాసనను తన పాటలతో ప్రపంచానికి పరిచయం చేస్తూ, స్వరాష్ట్ర ఉద్యమంలో గొంతెత్తి చాటిన పల్లెకవి, ప్రముఖ సినీ గీతరచయిత మిట్టపల్లి సురేందర్ కాళేశ్వర-ముక్తీశ్వర స్వామి దేవాలయానికి దర్శన నిమిత్తం వచ్చిన సందర్భంగా కాళేశ్వరం ఉప సర్పంచ్ చెమ్మాల సుధీర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ జిల్లాకు చెందిన సురేందర్‌తో కొంత సమయం గడిపిన సుధీర్ కుమార్, ఆయన సాహిత్య కృషిని మరియు తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన పాటలు పోషించిన కీలక పాత్రను కొనియా డారు. 'రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా' వంటి ఎన్నో ఆణిముత్యాలను అందించిన సురేందర్, తెలంగాణ ఉద్యమానికి పాటలతో ఊపిరి పోశారన్నారు. ఈసందర్భంగా ఉప సర్పంచ్ చెమ్మాల సుధీర్ కుమార్ మాట్లాడు తూ.. సామాన్యుల గుండె చప్పుడైన సురేందర్ వంటి కవులను కలవడం తనకు ఎంతో గౌరవంగా ఉందని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ప్రజాదరణ పొందిన గీతాలను రచించాలని ఆకాంక్షించారు.


మిట్టపల్లి సురేందర్‌ను కలిసిన ఉపసర్పంచ్ సుధీర్ కుమార్

## ఎంఈఓపై దురుసుగా ప్రవర్తించిన కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

**బచ్చన్నపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

ఎంఈఓ డాక్టర్ జి. కళావతి పై దురుసుగా ప్రవర్తించిన కరెస్పాండెంట్‌పై చర్యతీసుకుని బాల యేసు పాఠశాల పర్మిషన్ను రద్దు చేయాలని బచ్చన్నపేట మండల ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి డిమాండ్ చేశారు. సోమవారం జరుగుతున్న సెన్సెస్-2026 ఉపాధ్యాయుల టిజిఎంఎస్ బచ్చన్నపేట సమావేశంలో భోజన విరామ సమయంలో బచ్చన్నపేట మండలంలోని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల ఎంఈఓ డాక్టర్ జి.కళావతిపై దేవరుప్పుల మండలంలోని బాలయేసు పాఠశాల కరస్పాండెంట్ ఆదివారము పాఠశాల నడిపించడమే కాకుండా విద్యాశాఖ నిబంధనల మేరకు సెలవురోజు పాఠశాల నడవకూడదని ఎంఈఓ ఆ పాఠశాలను



సందర్శించినప్పుడు ఎంఈఓ పైన దురుసుగా ప్రవర్తించడం కాకుండా విద్యాశాఖ అధికారిపై మహిళా అనికూడా చూడకుండా నోటికిఇష్టం వచ్చినట్టుగా మాట్లాడడమే కాకుండా, దురుసుగా ప్రవర్తించిన కరెస్పాండెంట్‌పై చర్యతీసుకుని, బాలయేసు పాఠశాల పర్మిషన్ను రద్దు చేయాలని మండల ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దాదాపు 60మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పిఆర్టియు బాధ్యులు, టిపిటిఎఫ్ బాధ్యులు, యుటిఎఫ్ బాధ్యులు టిపియుఎస్ బాధ్యులు బిసిటిఏ బాధ్యులు డిటిఎఫ్ బాధ్యులు ఇతర సంఘాల బాధ్యులు నిరసన వ్యక్తంచేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన అశ్వరావుపల్లి సర్పంచ్ చైతన్య రాజు

**రఘునాథపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి గ్రామ సర్పంచ్ చైతన్య రాజు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచ్ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన చైతన్య రాజు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి



ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త పాత అనే తారతమ్యం లేకుండా గ్రామ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందే విధంగా చూడాలని, అవినీతికి దూరంగా ఉంటూ నీతి నిజాయితీగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి, మండలనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

**రఘునాథపల్లి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా సోమవారం రఘునాథపల్లి మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో టీడీపీ పార్టీ మండలఅధ్యక్షులు బొక్క రామచంద్రయ్య (చంద్రబాబు )ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులతో కేక్ కటింగ్ చేసి భాకాంక్షలు తెలిపారు. అనంతరం బస్ స్టాండ్ ప్రాంగణంలో ఉన్న ప్రయాణికులకు



స్వీట్లు, పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీ రాష్ట్ర నాయకులు ఎడ్ల మల్లేశం, ఎండీ.జహంగీర్, టీడీపీ మండలప్రధాన కార్యదర్శి కొంగరి నర్సింగరావు, మండల నాయకులు అడ్డూరి శ్రీనివాస్, బుస్సా టి తానాజీ, మల్కాపురం చంద్రమౌళి, ఇమ్మడిశెట్టి నగేష్, మాస శివ శంకర్, కర్రే వంశీ, గండికోట యాదగిరి, మరాటి వీరస్వామి, కాదనూరి మధుసూదన్, ఉమ్మగొని శ్రీహరి, మచ్చ మధు, పిన్నింటి మల్లయ్య, పన్నాల వెంకటరమణ, గాజులపాటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**చిల్పూర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన సుమారు 30మంది బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొల్లెపాక శ్రీనివాస్, ఇల్లందుల రాజు, బొక్కల మహేష్, బొక్కల ఆహారోన్, గడ్డమీది రమేష్, భూక్య శ్రీనివాస్, చిన్నపెల్లి కుమార్, సుక్క ప్రసాద్, తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, చుక్క రాజు తదితరులు ఉన్నారు. కొత్త పాత అనే తేడా లేకుండా పార్టీ బలోపేతానికి, గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సురేష్, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఇల్లందుల విజయ్, రవీందర్‌రెడ్డి, నీలరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనగణనపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

**బచ్చన్నపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**



జనగణనపై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు హుస్సేన్ తెలిపారు. జనగణన మొదటి ఫేజ్ మండలస్థాయి శిక్షణా తరగతులు బచ్చన్నపేట మోడల్ స్కూల్లో నిర్వహించారు. మండలంలో ఎనిమిరేటర్లు, సూపర్వైజర్లు కలిపి మొత్తం 92మందికి గాను మొదటి దఫలో సగంమందికి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ హుస్సేన్, మండల విద్యాశాఖాధికారి ఐ.వెంకట్ రెడ్డి, ఆర్ఐ వంశీ కృష్ణ, జిపివో సూర్యప్రకాష్, రిసోర్స్ పర్సనల్ కనకయ్య, లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారు.

## గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలి



**దుగ్గొండి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుంటే జన్మించే పసిపాపలు ఆరోగ్యవంతంగా జన్మిస్తారని ప్రాథమిక వైద్యాధికారి కిరణ్‌రాజ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణీ స్త్రీలకు బీపీ, షుగర్ రక్తపూత పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు అయితే ఉచిత వైద్యం, రవాణా సౌకర్యం, మందులు అందిస్తుందన్నారు. గ్రామాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. గర్భిణీస్త్రీలను నమోదు చేసి సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. సర్కారు దావఖానలో నాణ్యమైన వైద్యం అందేవిధంగా చేస్తామన్నారు. సిబ్బంది సమయపాలన తప్పకుండా పాటించాలన్నారు. వేసవిలో ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. బయటికి వెళ్లే ముందు తలపాగ చుట్టుకొని వెళ్లాలన్నారు. కలుషితమైన నీరు త్రాగి అనారోగ్యాల భారిన పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డా.రాకేష్, సిహెచ్‌వో సలోమి, హెచ్‌ఈవో సాంబయ్య, హెచ్‌వి సంధ్యారాణి, స్టాఫ్ నర్సు సబిత, జ్యోతి, ఎల్టీ స్వప్న, ఫార్మసిస్టు విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రహెమాన్, చాణిక్య, ఏఎన్ఎంలు సరస్వతి, కోమల, ప్రభావతి, సునిత, సరిత, రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్ట రక్షణకు ఉద్యమించాలి

**చెన్నారావుపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడం కోసం వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య అన్నారు. సొసైటీ ఆవరణంలో వ్యవసాయ కార్మిక సంఘం చెన్నరావుపేట మండల 6వ మాసభ ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉపాధి హామీ చట్టాన్ని నీరుగా చే ప్రయత్నం చేస్తుందని ఆయన అన్నారు, ఉపాధి హామీకి సరైన నిధులు కేటాయించకుండా వ్యవసాయ కూలీలు, కార్మికుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆయన అన్నారు, గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన అన్నారు, ఉపాధి హామీ చట్టం రక్షణకై ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వారు అన్నారు, అనంతరం నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులురాలు బుడిగె యాదమ్మ, కార్యదర్శి బూలె చంద్రకళ, ఉపాధ్యక్షులు మండల స్వరూప, మూగల సారమ్మ, సహాయ కార్యదర్శిలు మాదాసి కల్పన, ఎస్కే సైదా, తప్పట రమేష్, చిలువేరు కలమ్మ, 19 నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నవీన్ల స్వామి, మహిళ కూలీల జిల్లా కన్వీనర్ మొగులోజు శారద, అల్లం నారాయణ మరియు అధిక సంఖ్యలో వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అవార్డు అందుకున్న అజయ్

**చెన్నారావుపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫౌండర్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ తాళ్ళ అజయ్ డా.బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డును అందుకున్నారు. ఏప్రిల్ 19వ తేదిన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య ఆకాడమి 9వ తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య ఆకాడమి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సంధర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్.సి., ఎస్.టి., బి.సి. మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేసి నట్లు తెలియజేశారు. అంబేద్కర్ భావజాలంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ల చైతన్యం కోసం కృషి చేస్తున్న డా.తాళ్ళ అజయ్‌కి ఈ అవార్డు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటి సభ్యులు తాటికంటి ఐలయ్య, బాదె వెంకటేషం, బొమ్మకంటి రాజేందర్, అకెపోగు ప్రమోద్ మహరాజ్, ప్రవీణ్, మనోజ్ , శివాజీ పాల్గొన్నారు.

# దొరతనపు అహంకారంపై భగ్గుమన్న మంత్రి సీతక్క

ఫ్రీబస్ పథకంపై కెసిఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మంత్రి

పథకం రద్దు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా..?

అని మంత్రి సీతక్క సవాల్.



**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త.** ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మాజీ సీఎం చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ పథకాన్ని "పనికిమాలినది"గా అభివర్ణించడం దోరతనపు ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు.వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. పథకం పనికిరాదని భావిస్తే, దాన్ని రద్దు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు.ఈ పథకం వల్ల లక్షలాది మహిళలు ప్రతిరోజూ ప్రయాణ ఖర్చులు ఆదా చేసుకుంటూ ఉద్యోగాలు, విద్య, వైద్య సేవలను సులభంగా పొందుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు రూ.10 వేల కోట్ల మేర మహిళలపై ఉన్న ప్రయాణ భారం తగ్గిందని పేర్కొన్నారు. ఇది మహిళల ఆర్థిక స్వావలంబనకు, సామాజిక స్వేచ్ఛకు దోహదపడే కీలక చర్య అని వివరించారు. ప్రజలకు మేలు చేస్తున్న పథకాన్ని తక్కువ చేసి చూపే ప్రయత్నం జరుగుతోందని విమ ర్శించారు. మహిళలు స్వతంత్రంగా బయటకు రావడాన్ని అడ్డుకోవాలనే దోరతనపు ఆలోచనల వల్లే ఇలాంటి వ్యాఖ్యలు వస్తున్నాయని అన్నారు. మహిళల మనోభావాలను దెబ్బతీసినందుకు వెంటనే మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఐటీడీఏ లో లీగల్ సెల్ కోఆర్డినేటర్‌ను నియమించాలి

గిరిజనులకు సత్వర న్యాయం జరుగుతుంది

తుడుం దెబ్బ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు పోడెం బాబు



**ప్రభాతవార్త ఏటూర్ నాగారం ఏప్రిల్ 20:** స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో లీగల్ సెల్ కోఆర్డినేటర్ ను నియమించాలంటూ కోరుతూ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి గిరిజన దర్బార్లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు పో డెం బాబు మరియు కబ్బాక లక్ష్మణ్ లు ఐటీడీఏ ఇన్చార్జి పిఓ, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటూర్ నాగారం ఐటిడిఏ పరిధిలోని ఆదివాసీ గిరిజనులు ఎల్ టి ఆర్, పె సాచట్టం, ఆర్వో ఎఫ్ ఆర్ చట్టాలపై అవగాహన లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇట్టి విషయాలపై సమగ్ర అవగాహన కలిగినటువంటి అడ్వకేట్ మడి సాయి బాబాను లీగల్ సెల్ కోఆర్డినేటర్ గా నియమించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. లీగల్ సెల్ కోఆర్డినేటర్ ను ఏర్పాటు చేసినచో ఆదివాసి గిరిజనుల కేసులు త్వరితగతిన పరిష్కారమై సత్వర న్యాయం చేకూరుతుందని వారు ఆకాంక్షించారు.

## కేశవనగర్‌లో బొడ్రాయి నిర్మాణానికి శ్రీకారం

### సర్పంచ్ జయరాజేందర్ హామీ నెరవేర్చిన తీరు

ధర్మసాగర్, ఏప్రిల్ 20( ప్రభాతవార్త ):

ఇటీవల జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో కేశవనగర్ గ్రామానికి సర్పంచ్



అభ్యర్థిగా గంగారపు జయరాజేందర్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామంలో బొడ్రాయి లేకపోవడంతో,తన సొంత ఖర్చులతో రూ.5 లక్షలు వెచ్చించి బొడ్రాయి నిర్మాణం చేపట్టాలని ఆయన నిర్ణయించారు.ఈ క్రమంలో సోమవారం బొడ్రాయి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ జయరాజేందర్ స్వయంగా ముగ్గు వేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కమిటీ మెంబర్లు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామస్థులు అభినందించారు.

## నూతన సాంకేతికతతో ఊపిరితిత్తుల వ్యాధులకు చెక్ డాక్టర్ నాగార్జున మాటూరు

ఏప్రిల్ 20, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :



పెరుగుతున్న ఊపిరితిత్తుల సమస్యలు అధునాతన చికిత్సలే పరిష్కారం అని డాక్టర్ నాగార్జున మాటూరు అన్నారు.నగరంలో వాయు కాలుష్యంపై యుద్ధం, ఊపిరితిత్తుల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా ఊపిరితిత్తుల వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని, వీటిని అరికట్టేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ వైద్య నిపుణులు పేర్కొన్నారు. నగరంలోని కోడెం కన్వెన్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హైటెక్ సిటీ ఆసుపత్రి డాక్టర్ నాగార్జున మాటూరు ఈ మేరకు వివరాలను వెల్లడించారు. అధునాతన చికిత్స గతంలో ఊపిరితిత్తుల సమస్యలకు కేవలం మెట్రో నగరాల్లోనే అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవలు, సాంకేతికత వినియోగంతో ఎండో బ్రోన్కియల్ అల్ట్రాసౌండ్ ( ఈబూస్ ) ఇతర నూతన డయాగ్నోస్టిక్ పరికరాల ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇతర జబ్బులను తొలి దశలోనే గుర్తించే అవకాశం కలిగింది. కోవిడ్ తర్వాత చాలా మందిలో ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గిందని, దీర్ఘకాలిక దగ్గు లేదా ఆయాసం ఉన్నవారు వెంటనే నిపుణులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. ధూమపానానికి దూరంగా ఉండటం, కాలుష్య నివారణ చర్యలు చేపట్టడం ద్వారా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వారు వివరించారు. యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్టులు, వైద్య బృందంతో పాటు హాస్పిటల్స్ సిబ్బంది నరేష్, సాయి వెంకట్, విజయ్, అనుదీప్ ప్రతినిధులు పాల్గొన్నారు. అత్యుత్తమ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే తమ లక్ష్యమని డాక్టర్ నాగార్జున మాటూరి స్పష్టం చేశారు.

## సిరిపురం లింకు రోడ్లను బిటి రోడ్లుగా మార్చాలి

రామన్నపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త

సిరిపురం గ్రామం నుండి ఇతర గ్రామాలకు వెళ్లే అంతర్గత పంచాయతి రాజ్ రోడ్లను బి.టి రోడ్లుగా మార్చి ప్రజల సమస్య పరిష్కరించాలని సి.పి.ఎం జిల్లా కమిటి సభ్యుడు బల్గురి అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సి.పి.ఎం పోరు యాత్రలో భాగంగా గ్రామ సి.పి.ఎం నాయకులతో కలసి సోమవారం వెలిమినేడు, పెద్దకాపర్తి, ఇంద్ర పాలనగరం రోడ్లను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు.ప్రధాన రహదారులైన రోడ్లు గుంతల మాయంగా మారి ప్రయాణాలకు ఇబ్బందిగా మరాయని, దశబ్దాల కాలంగా ప్రజలు కోరుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని వాయారు. వెంటనే బి.టి రోడ్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎం.పీ.టీ.సీ లు బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్, కూనూరు వెంకటేశం, వార్డు సభ్యులు మొటే స్వామి, జెల్ల శ్రీనాథం,సంగిశెట్టి మహేష్ గ్రామ నాయకులు కూనూరు గణేష్, కంకల నరసింహా,బల్గురి నరసింహా, కందుల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ములుగు వార్త

## శ్రీ హేమచల లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొనున్న రాష్ట్ర మంత్రి సీతక్క.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్



**మంగపేట ఏప్రిల్20, ప్రభాతవార్త.** మంగపేట మండలం లోని మల్లూరు గ్రామం స్వయంబు గా వెలిసిన శ్రీ హేమచల లక్ష్మి నరసింహ స్వామి వారిని నేడు ఉదయం 9గంటలకు దర్శించుకోనున్న మన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క. అదేవిధంగా దర్శనం అనంతరం ఉదయం 09.00 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చుంచుపల్లి, కొట్టమల్లూరు, మల్లూరు, పురేడుపల్లి, శనగకుంట, నర్సింహసాగర్ గ్రామ ప్రజల సమస్య పరిష్కారం కొరకు జిల్లా యంత్రాంగం తో ప్రజా దర్బార్ కార్యక్రమం లో పాల్గొంటారు అదే విధంగా ఉదయం 10.00 గంటలకు బోర్ నర్సాపురం, మంగపేట, తొండ్యాల లక్ష్మిపురం, కోమటిపల్లి గ్రామాలలోనీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం మంగపేట కేంద్రం లోని సొసైటీ కార్యాలయం వెనక ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది కావున మంగపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ నాయకులు అదేవిధంగా అనుబంధ సంఘల నాయకులు (ఎస్సి సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్, కిసాన్ కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు, సోదరులు అందరూ పాల్గొని మంత్రి సీతక్క పర్యటనను విజయవంతం చేయల్సిందిగా కోరారు. మైల జయరామ్ రెడ్డి మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

## గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ కు సర్పంచ్ సరిత వినతి



**ప్రభాతవార్త ఏటూర్ నాగారం ఏప్రిల్ 20:** స్థానిక ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో మండలంలోని రాంనగర్ కోయగూడా ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ పోరిక సరిత తమ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ కోరుతూ ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మాట్లాడుతూ పప్కాపూర్ గ్రామంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలో త్రాగునీటి కొరకు కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేయాలంటూ, కోయగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేయాలంటూ, లంబడి తండాలో ఉన్న ఎంపీపీ ఎస్ పాఠశాల కు నూతన భవన నిర్మాణా నీ కి నిధులు మంజూరు చేసి వేరే చోట నిర్మించాలని , రాంనగర్ లంబడి తండా గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల యందు త్రాగునీటి కొరకు చేతిపంపు లు ఏర్పాటు చేయాలని, అలాగే రాంనగర్ పప్కాపూర్ ఎంపీపీ ఎస్ పాఠశాలకు ప్రహరి గోడలు నిర్మించాలని, అంగన్వాడి సెంటర్ల మైనర్ రిపేర్ల కు నిధులు మంజూరు చేయాలంటూ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు.

# ఆదివాసుల భూ సమస్య పరిష్కరించాలి

### ప్రజాదర్బార్లో కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన గొండ్వాన సంక్షేమ పరిషత్...



**వెంకటాపురం అర్బన్ ప్రభాతవార్త :** ఏజెన్సీ ప్రాంతంలో ఏండ్ల తరబడి ఆదివాసులు భూములను సాగు చేస్తూ ఉన్నప్పటికీ వాళ్లకి ఎలాంటి హక్కు కల్పించడం లేదని అధికారులపై గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మండిపడ్డారు.సోమవారం ఐటీడీఏ కార్యాలయం నందు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ చేయడం జరిగింది. ఈ సంధర్భంగా గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి,ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ కలెక్టర్ దివాకర్ ను కలసి ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలపై మెమోరండం ఇవ్వడం జరిగింది.అనంతరం జీఎస్పి రాష్ట్ర కార్య దర్శి పూనెం సాయి మాట్లాడుతూ. వెంకటాపురం మండలం కొమరం భీం కాలనీ ఆదివాసులు ఏళ్ల తరబడి భూమిని తాగు చేస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఈ భూమిపై గిరిజనేతరులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన వాళ్లని ఎదుర్కొని ఈనాడు ఆ భూమిని సాగు చేసే క్రమంలో ఫారెస్ట్ అధికారులు ఇది మా భూమి అంటూ చెప్పడం విడ్డూరం అన్నారు. వాడగూడెం (జి)సర్వే నెంబర్ 27 లో దాదాపు 140 ఎకరాలు రెవిన్యూ భూమి ఉన్నప్పటికీ,ఆ భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన ఎద్దేవ చేశారు.అదే సర్వే నెంబరు 27 భూమిలో గిరిజనేతరులకు పహాని రికార్డులు ఎంటర్ చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు దిక్కులు చూస్తున్నారా..అని ఆయన మండి పడ్డారు. ఫారెస్ట్ భూములలో అనేకమంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు పొందుతుంటే చోద్యం చూస్తున్నారు తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తేల్చి చెప్పాలని సవాల్ చేశారు. కొమరం భీం కాలనీ ఆదివాసుల భూ సమస్యపై ఫారెస్ట్ అధికారుల వైఖరి మార్చుకోకపోతే త్వరలో ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఆదివాసికి సాగు చేసే హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తురస చంటి,కొమరం భీం కాలనీ ఆదివాసులు రమేష్ సంతోష్ లక్ష్మయ్య రాజేష్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం వార్త

## శ్రీ రామాలయం గుడి నిర్మాణానికి సహకరిస్తా

**వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త ::**



మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో శ్రీ రామాలయం గుడి నిర్మాణానికి తన వంతుగా సహకరిస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రామాలయం నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామంలో నిర్మిస్తున్న రామాలయం గుడి నిర్మాణానికి ప్రభుత్వం నుండి సహకరిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను,ఉప సర్పంచ్ కొండ తిరుపతి, వార్డు సభ్యులు సీనియర్ నాయకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విజన్ స్కూల్ విద్యార్థులు పోలీస్ స్టేషన్ సందర్శన

**వెంకటాపూరం అర్బన్ ప్రభాతవార్త:**





విజన్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థు లకు సామాజిక అవగాహన కల్పించే భాగంగా, సోమవారం రోజు వెంకటాపురం పోలీస్ స్టేషన్ను విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు విద్యార్థులను సాదరంగా ఆహ్వానించి, పోలీస్ వ్యవస్థ లోని వివిధ విభాగాలు, వారి విధులు, బాధ్యతలు గురించి సమగ్రంగా వివరించారు. పోలీస్ స్టేషన్లోని రిసెప్షన్ విభాగం నుంచి ప్రారంభించి, ఇతర శాఖల పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ, కేసుల నమోదు, విచారణ ప్రక్రియలు, ప్రజల భద్రతకు తీసుకునే చర్యలు వంటి అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. పోలీస్ శాఖలో ఉన్న వివిధ హోదాలు, నియామక విధానం, వారి బాధ్యతల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతి రావు గారు రోడ్ సేఫ్టీ, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, చట్టాల పట్ల గౌరవం వంటి ముఖ్యమైన విషయాలపై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. అదేవిధంగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, లక్ష్య సాధనపై ప్రేరణాత్మక సందేశాలను అందించారు. చివరిగా విద్యార్థులతో ఎస్ఐ గారు పరస్పర చర్చ నిర్వహించి, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పోలీస్ శాఖ విధులు, కేసుల విచారణ, చట్ట అవగాహన, ప్రజల భద్రత, సామాజిక బాధ్యత వంటి అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోలీస్ వ్యవస్థపై సమగ్ర అవగాహన పొందడమే కాకుండా, సమాజానికి బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన విలువలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని విజన్ స్కూల్ వ్యవస్థాపకులు బహుబలేంద్రుని వెంకట రామారావు గారు మరియు వారి బృందం విజయవంతంగా నిర్వహించారు.

## అక్రమార్కుల చేతికే మళ్ళీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు.

### నిద్రమత్తులో సంబంధిత అధికారులు.

### అవినీతి జరిగిందని కోడై కూసినా మళ్లీ వారికి కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటో?

**మంగపేట ఏప్రిల్20, ప్రభాతవార్త.** మంగపేట మండలంలో గత వర్షాకాలం సీజన్ లో బోరు నర్సాపూర్ గ్రామంలో ఉన్నటువంటి మ్యాక్స్ సెంటర్ నిర్వా హకులు అవక తవకలకు పాల్పడి వారి సంబంధికుల ఖాతాలోకి ప్రభుత్వం నుంచి డబ్బులు కొట్టించుకున్న పరిస్థితి మండలమంతా నెలరోజులపాటు కోడై కూసింది. కొన్ని రకాల నిగా వర్గాలు గుట్టుచప్పుడు కాకుండా ఎంక్వయిరీలు జరిపినట్లు తెలిసిందే ఇంత జరిగినా మరలా ఈ సీజన్ ధాన్యం కొనుగోలు అధికార పార్టీ అండదండలతో ఎన్ని కుంభకోణాలు చేసిన ఎన్ని తప్పులు చేసిన మళ్ళీ వారికే ధాన్యం కొనుగోలు మాక్స్ సెంటర్ లు గవర్నమెంట్ కట్టబెట్టడం చూస్తుంటే సంబంధిత అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు తెలుస్తుందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారని జ్వలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడలు నరేష్ ఆరోపిస్తున్నారు. వెంటనే కొనుగులు నిలిపివేసి నిరుద్యోగులె వరికైనా అప్పగించి కొనుగోలు నిర్వహించాలని ఆయన అధికారులను కోరారు. తధ్వారా అక్రమాలను అరికట్టినవారవుతారని అభిప్రాయపడ్డారు.

## కమలాపురం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గుమ్మడి సోమయ్య

**మంగపేట ఏప్రిల్20, ప్రభాతవార్త.**



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం లోనే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలని మద్దతు ధర ఉంటుందని, సన్న ధాన్యానికి రూపాయలు 500 బోనస్ పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. మంగపేట మండలంలోని కమలాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిరాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ఏ గ్రేడు రకానికి రూపాయలు 2389, కామన్ రకానికి రూపాయలు 2369, ప్రభుత్వ మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ పొందాలని గుమ్మడి సోమయ్య అన్నారు. సోమవారం హనుమాన్ టెంపుల్ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో సొసైటీ సీఈవో గౌరమ్మ, మాజీ సొసైటీ చైర్మన్ తోట రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా నాయకులు పెద్ది నర్సింహారావు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రసన్నాంజనేయ రైతు సంఘం అధ్యక్షుడు బొనగాని యాదగిరి, రైతులు. ఎల్లంకి రాజేష్, పాటిబండ్ల హనుమంతరావు, గొట్టం యాదగిరి, పంజాల శేఖర్, చిలకపాటి బలరాం. సెంటర్ ఇంచార్జ్, కార్యదర్శి ఏనుగుల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ విధానం...

**మొదటి పేజి తరువాయి..** ప్రజలు గడీల పాలనను అసహించుకుని, ప్రజాస్వామ్యబద్ధమైన కాంగ్రెస్ పాలనను తెచ్చుకున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రజా పాలన ఎందుకు పోవాలో జీవన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'కేసీఆర్ తన హయాంలో 20 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ, కనీసం 20 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కూడా కట్టలేదని విమర్శించారు. పేదలకు గూడు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మా ప్రభు త్వం ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఇవన్నీ చేస్తున్నందుకే మా ప్రభుత్వం పోవాలని కోరుకుంటున్నారా..?' అని నిలదీశారు. తెలంగాణలో మళ్లీ గడీల పాలన రాదని, తమ ప్రభుత్వం కొద్దిమందికి ఊడిగం చేసే ప్రభుత్వం కాదని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. రైతుల సంక్షేమం కోసం, పేదల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వంశీకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో రైతులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# నేడు మంగపేట మండలంలో ప్రజా దర్బార్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్..



**మంగపేట ఏప్రిల్20, ప్రభాతవార్త.** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు, మంగపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మంగపేట మండలంలోని మల్లూరు, మంగపేట గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డిఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# గార్బేజ్ పికింగ్ స్టిక్ తో చెత్త సేకరణ సులభం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ సిటి ఏప్రిల్20 ప్రభాతవార్త

వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గార్బేజ్ పికింగ్ స్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గార్బేజ్ పికింగ్ స్టిక్ ఉపయోగించడం ద్వారా నేలపై ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, చిత్తుకాగితాలు వంటి చెత్తను ఎలాంటి ఇబ్బంది లేకుండా సులభంగా సేకరించవచ్చని పేర్కొన్నారు. సేకరించిన చెత్తను



సక్రమంగా భద్రపరచి రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని సూచించారు. అలాగే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం కూడా సులభమవుతుందని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చెత్త ఎక్కువగా పోగయ్యే సంస్థలకు, ఎక్కువ మంది పనిచేసే ప్రాంగణాలకు, ఆసుపత్రులకు ఈ స్టిక్స్ చాలా ఉపయోగకరంగా ఉంటాయి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిబిసిటీవో పుష్పలత తదితరులు ఉన్నారు.




# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

గీసుగొండ ప్రభాతవార్త



వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 15,16 వ డివిజన్ల లో సిసి రోడ్, డ్రైనేజ్ పనులకు మేయర్ గుండు సుధారాణితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. దాదాపు 3కోట్ల 26 లక్షలతో ఈ పనులను చేపట్టామని అన్నారు. అనంతరం ధర్మారంలో మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి మహర్దశను చేరుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను శాలువాతో సత్కరించి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన పలు జర్నలిస్టు సంఘాలు

వరంగల్ సిటి ఏప్రిల్20 ప్రభాతవార్త



వరంగల్ తూర్పు సీనియర్ జర్నలిస్టు వెలగందుల అజయ్ కుటుంబాన్ని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రముఖ జర్నలిస్టు అజయ్ తండ్రి వెలుగందుల సాంబయ్య ఇటీవల మరణించగా, వారి పార్థివ దేహానికి జర్నలిస్టు వర్గాలు ఘనంగా నివాళులర్పించాయి. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జే (ఐజేయు) వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు కందుల శ్రీధర్, డబ్ల్యూజె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయసాగర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు పోదేటి అశోక్, జిల్లా కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, జిల్లా నాయకులు అనంతుల రమేష్, ఈర్ల సురేందర్, టిడబ్ల్యూజెహెచ్ 143 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిట్ట నవనీత్ గౌడ్, నీలం శివ, బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఆయూబ్, పలువురు జర్నలిస్టు లు పాల్గొని సాంబయ్య పార్థివ దేహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంబయ్య కుటుంబ సభ్యులకు అతను లేని ఈ అపూర్వ లోటును భరించే ధైర్యం కలగాలని ఆకాంక్షి ంచారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలు మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులు, స్నేహితులు, బంధువులు తదితరులు పాల్గొని సాంబయ్య ను స్మరించుకున్నారు.

# తల్లిదండ్రులు కుటుంబ సభ్యులతో సమయం గడపండి

ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



తల్లిదండ్రులు కుటుంబ సభ్యులతో సమయం గడపండి" అని తెలంగాణ రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీ దేవసేన, ఐ.ఎ.ఎస్., సూచించారు. సోమవారం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో విశ్వవిద్యాలయ చేతనాసెల్ ఆధ్వర్యంలో సంచాలకులు ఆచార్య ఎం.స్వర్ణలత అధ్యక్షతన, వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్" అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, ఎక్కువ సమయం మొబైల్ ఫోన్ల వినియోగానికి కేటాయిస్తున్నారని, రోజువారీ పనులను కూడా పూర్తి చేయలేనంత ఒత్తిడి పెరిగిందని చెప్పారు. గత తరంతో పోలిస్తే ప్రస్తుత తరం అధిక ఒత్తిడిలో ఉందని అభిప్రాయపడ్డారు. ఓయూ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. తిరుపతిరావు మాట్లాడుతూ చిన్న విషయాలను పెద్దగా తీసుకోకూడదని క్రమశిక్షణతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ లక్ష్య సాధనకు సరైన ప్రణాళిక అవసరమన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బి.వీరేందర్ తన ప్రేరణాత్మక ప్రసంగంలో ఒత్తిడి నివారణకు సంబంధించిన అనేక ప్రయోగాత్మక అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి ఉదయం సోషియాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ప్రారంభించారు. రిజిస్ట్రార్ వి.రామచంద్రం, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి, జాతీయ సేవాపథకం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, వేదన సెల్ సంచాలకులు డాక్టర్ ఆర్. మేఘనా రావు, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి, చేతనా కమిటీ సభ్యులు డాక్టర్ కోలాశంకర్, డాక్టర్ సంపత్ రెడ్డి బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

వర్ధన్నపేట/ఏప్రిల్ 20 ప్రభాత వార్త



ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారంటూ జరుగుతున్న ప్రచారం కేవలం అబద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని ఇల్లంద కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎద్దు రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్నటి రోజున బీఆర్ఎస్‌లో చేరిన వారిలో అసలు కాంగ్రెస్ కార్యకర్తలే లేరని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు పనితీరును చూసి ఇతర పార్టీల వారే కాంగ్రెస్‌లోకి వస్తున్నారని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉద్యోగాలు, దళిత సీఎం వంటి హామీలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కేవలం రెండున్నర ఏళ్లలోనే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉద్యోగాల భర్తీతో సంక్షేమ పాలన అందిస్తోందని, దీనిని తట్టుకోలేకనే బీఆర్ఎస్ అసత్య ప్రచారాలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు.

# ఇల్లందలో రైతు భరోసా సంబరాలు రెండో విడత రైతు భరోసా నిధుల విడుదల

వర్ధన్నపేట/ ఏప్రిల్ 20 ప్రభాత వార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం నేడు పండుగలా సాగింది. ఇల్లంద రైతు వేదికలో ఏ.ఓ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు సత్యం, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండో విడతలో 1 నుండి 5 ఎకరాల లోపు ఉన్న 45.11 లక్షల మంది రైతులకు ..5,653 కోట్లు నేరుగా ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోందని ఇప్పటికే ఎకరం లోపు ఉన్న 68 లక్షల మందికి .. 3,590 కోట్లు అందజేసిందని రైతన్నలకు భారీ ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఈ ప్రభుత్వం నిజమైన రైతు పక్షపాతి అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు సభ్యులు బాషబోయిన ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు రాజు, మంద భాస్కర్ రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు వేడుకలు

వరంగల్ సిటీ ఏప్రిల్ 20 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు వేడుకలు సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం వరంగల్ వరంగల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో బాణాసంచాలు కాల్చి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిలువేరు రవీందర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పనిచేసిన రోజుల్లో ఉమ్మడి రాష్ట్రం మొత్తం మీద ఐదు లక్షల డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. మహిళా సోదరి మణులు ఆర్థికంగా ముందుకు నడిచే విధంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. ఆడబిడ్డలు కట్టెల పొయ్యి పై వంట చేస్తుంటే




వారు అనారోగ్యాల పాలవుతున్నారని ఆడబిడ్డలకు దీపం పథకం కింద గ్యాస్ స్టవ్ ఇచ్చిన ఘనత చంద్రబాబుకె దక్కిందని గుర్తు చేశారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ జన్మభూమి కార్యక్రమాలు ప్రజల వద్దకే పాలన లాంటి కార్యక్రమాలు ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు తెలిపారు. ముందు చూపు ఉన్న నాయకుడు కాబట్టి హైదరాబాద్ నగరాన్ని ఐటీ హబ్బుగా తీర్చిదిద్ది వందల మల్టీ నేషనల్ సాఫ్ట్వేర్ కంపెనీలను హైదరాబాద్ నగరంలో ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈరోజు తెలంగాణకు 60 శాతం ఆదాయం రావడానికి కారణం చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ అంటే ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ దేవుళ్ళు సమాజమే దేవాలయం అని నమ్మిన సిద్ధాంతం కోసం అధికారం ఉన్నా లేకపోయినా ప్రజా సంక్షేమం కోసం ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్నాల నరేందర్, బరిగెల సుధాకర్, సింగారపు దేవేందర్ శిరబోయిన రాజు, కాండ్రాతి రాజు, పోలె పాక సాయి కుమార్, బజ్జూరి వీరేశం, ఎన్టీఆర్ మొగిలి, కాండ్రాతి చిన్న రవి, మారేడుపక హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చదువే భవిష్యత్.. బడిబాటకు ఊతం..

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

ప్రతీబాలబాలిక పాఠశాలకు వెళ్లాలని, బడిబాటపై ప్రత్యేక దృష్టి సారించాలని, చదువే భవిష్యత్తు అని, విద్యాభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పేర్కొన్నారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ జిల్లాలో విద్యాప్రమాణాల పెంపు, కొత్త విద్యార్థుల నమోదుపై ఎంఈఓలు, సిహెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులతో క్షుణ్ణంగా చర్చించి, పలు ముఖ్యసూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల21, 22వ తేదీల్లో చేపట్టే "బడిబాట" ప్రత్యేక నమోదు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో గరిష్ట నమోదు సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు.ఇంటింటి సర్వేను క్రమబద్ధంగా నిర్వహించి పాఠశాలకు వెళ్లని పిల్లలు, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు (డ్రాప్‌ఔట్స్), అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బోధన వంటి సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా జిల్లాలో విద్యాశాతం పెంపొందించడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.అలాగే డిజిటల్ తరగతులు, ఇంటర్నెట్ సౌకర్యాలు, ఆధునిక బోధన పద్ధతులు, మధ్యాహ్న భోజనం, అలాగే పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనను బలోపేతం చేసి, విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయో తల్లిదండ్రులకు నిశితంగా తెలియజేయాలన్నారు. ప్రతి



విద్యార్థిచదువులో పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈనెల 23వ తేదీ నజిల్లాలోని అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని, ఈ సమావేశంలో విద్యార్థుల విద్యాప్రగతి, హాజరు, ప్రవర్తన, ఆరోగ్యం, నియమశీలత వంటి అంశాలపై చర్చించాలన్నారు. పీటీఎం ఒక సాధారణ కార్యక్రమం కాకుండా ప్రతి విద్యార్థి ప్రగతిపై ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా వివరించే వేదికగా ఉండాలని సూచించారు.సమావేశంలో ఏఎంఓ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, అన్ని మండలాల ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం- నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టిసారించాలి

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ**

జనగామ టౌన్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :

పాఠశాలలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యతపై అవగాహన కింద జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా పాఠశాలలో



మధ్యాహ్న భోజనపథకం అమలు విధానాన్ని కలెక్టర్ సమగ్రంగా తనిఖీ చేశారు.వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో సరైన ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధం పరిస్థితిని పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే తరగతి గదులను సందర్శించి, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణను పర్యవేక్షించి, పరీక్షలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అదేవిధంగా, పాఠశాలలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించి, పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం ప్రతీఒక్కరి బాధ్యత అని తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించాలని సూచించారు.ఈ తనిఖీలో డీసీఓ/ప్రిన్సిపల్ శ్రీనివాస్, సహాయ వార్డెన్ సైదయ్య, హెడ్ సూపర్వైజర్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

బచ్చన్నపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటచారి అన్నారు. గంగాపూర్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చేర్యాల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటచారి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలుకేంద్రాల వద్ద వడ్లను ఆరబెట్టి, తేమ, తాలు, లేకుండా చూసుకొని మద్దతు ధరకు అమ్ముకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మహమ్మద్ మసూద్, మండల నాయకులు జిల్లెల్ల దయాకర్ రెడ్డి, వార్డు సభ్యులు బందారం రవళిక, పిట్టల మమత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జ్యోతిఅనిత, ఎడ్ల మంజుల, ఇండ్ల రాములు, ఎడ్ల గాల్‌రెడ్డి, రైతులు ఇరుగుదిండ్ల వెంకటయ్య, నారాయణ,వెంకటమ్మ, అంజమ్మ, సదానందం, జిల్లెల్ల మల్లారెడ్డి, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధన్వంతి జన్మదిన వేడుకలు

నర్మెట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూస అంజయ్య, చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ఎల్ అంజయ్య, యూత్ ఉపాధ్యక్షుడు గొట్టేరాజశేఖర్, నర్మెట ఉపాధ్యక్షుడు బాబు,నరేష్ పిఎసిఎస్ తాజా మాజీ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి, కన్నెబోయిన శ్రీను పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థినులచే ఫ్లాష్‌మాబ్



కొడకండ్ల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :

సమకాలీన అంశాలపై అవగహన కల్పిస్తూ కొడకండ్ల లోని గురుకుల పాఠశాల విద్యార్థినిలు బస్టాండ్ సమీపంలో సోమవారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు.మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, బాలికల విద్య ప్రాముఖ్యత, ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్త, వేసవిలో త్రాగునీటి, మూగజీవాల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ఈ ఫ్లాష్ మాబ్ ని నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ కుమార్ తెలిపారు. ఉల్లాసభరితంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో గ్రేస్ కేజియారాణి, ఉపసర్పంచ్ మొహమ్మద్ షన్న, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## బాలయేసు యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలి

దేవరుప్పుల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :

దేవరుప్పుల మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాల యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లాకమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జనగామ జిల్లా ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొదల లవకుమార్, దాసగోనీ సుమ మాట్లాడుతూ బాలయేసు పాఠశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అనుమతులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా సెలవురోజు పాఠశాలను నడుపుతున్నారన్నారు. వెరిఫికేషన్‌కోసం పోయిన మండల విద్యాశాఖ అధికారిపై దాడీకి ప్రయత్నించడం, దుర్భాషలాడడం, అసభ్యపదజాలంతో దూషించడం సమంజసం కాదన్నారు. సిఆర్‌పి యాకన్న ఎంఈఓ కళావతి సెల్‌ఫోన్స్ లాక్కోవడం చట్ట వ్యతిరేకమన్నారు. వెంటనే కరస్పాండెంట్ జేసురాజుపై క్రిమినల్ కేసునమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాత్వికరెడ్డి, విప్లవ్,రాజు, స్నేహ పాల్గొన్నారు.

## జనగామ వార్త



# ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జనగామ టౌన్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. ఈసందర్భంగా ప్రజాసమస్యలపై 224 అర్జీలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తు ప్రజాసమస్యలపై తగినచర్యలు తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, ఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్, డీఎంహెచ్ఓ మల్లికార్జునరావు, బీసీ సంక్షేమశాఖ అధికారి ఎన్ఎల్.నరసింహరావు, ఎక్సైజ్ ఎస్పీ అనిత, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ బసవేశ్వర జయంతి

జనగామ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. బసవేశ్వరుడి ఆశయాలను అనుసరించి సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎన్.ఎల్.నరసింహరావు, ఏబీసీడీఓ రవీందర్, కుల సంఘాలనాయకులు, ఐడిఓసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మెనూప్రకారం విద్యార్థులకు భోజనం

బచ్చన్నపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకపోతే చర్యలు ఉంటాయని తహసీల్దార్ ఇంద్రవెల్లి హుస్సేన్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని ఎస్టీ హాస్టల్‌ను తహసిల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మెనూ ను ఆయన స్వయంగా పరిశీలించారు. వంటశాలలో భోజనం, కూరలను పరిశీలించి, ఎంతమంది విద్యార్థులకు వండారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం వండిన కూర తక్కువగా ఉండటంతో ఈ విధంగా ఉంటే చర్యలు తప్పకుండా ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతతో కూడిన మెనూప్రకారం అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. విద్యార్థుల సంఖ్య ఎంత, ప్రతిరోజు ఎంతమంది ఉంటున్నారు. ఆబ్సెంట్ అయిన విద్యార్థులు ఉన్నారా అని తదితర విషయాలను ఆయన ఆరాతీశారు. ప్రతిరోజు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని తహసీల్దార్ సూచించారు.

# మహా మహనీయుడు అంబేద్కర్



**నల్లబెల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత అభినవ దళిత బాంధవుడు చరిత్ర పుటాల్లో నిరంతరం నిలిచే మహా మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఎమ్మార్పీఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు దళిత రత్న అవార్డు గ్రహీత.పరికిరత్నం. తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు సాంబయ్య పేర్కొన్నారు. ఇటీవల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్135 వ జయంతి ఉత్స వాలను పురస్కరించుకొని ఆ మహానుభావుడు జీవిత చరిత్రపై ఎనిమిదవ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు అందులో విజేతలైన విద్యార్థులకు సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయ ప్రాంగణంలో శాలువా కప్పి బహుమతి ప్రధాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బట్టు.సాంబయ్య. పరికి రత్నం.లు మాట్లాడుతూ అంటరానితనం నిరక్షరాస్యత నిర్మూలన కోసం అనునిత్యం భారతదేశ ప్రగతి నీ చాటి చెప్పే విధంగా భారత రాజ్యాంగాన్ని నిర్మించిన ఆ మహనీయుడి ఆశయ సాధన కోసం అన్ని వర్గాల యువత ముందుకు రావాలని వారు కోరారు. నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుందని ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంగా చదువుకొని ఉన్న ఊరికి తల్లిదండ్రులకు విద్యాబోధించిన ఉపాధ్యాయులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు. ఈ జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో 86 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు వార్తలు.అనంతరం మండల కేంద్రానికి చెందిన కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం బాలికలు వ్యాసరచన పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానం సంపాదించగా. తృతీయ బహుమతి మండలంలోని రంగాపూర్ ప్రభుత్వ పాఠశాల బాలుడు సాధించాడు.

# పేద ప్రజల వెన్నంటూ ఉండేది కమ్యూనిస్టులే



**నల్లబెల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

పేద ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటు వెన్నంటూ ఉండే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది. కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, సామాజిక ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ పార్టీలో చేరారు. వారికి కుమారస్వామి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అనగాన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు తెలంగాణ ఉద్యమకారుడు. పరికి కోర్నెల్. తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు సాంబయ్య, తెలంగాణ మలిదశ జేఏసీ ఉద్యమకారులు, మామిండ్ల పెద్ద ఐలయ్య కనకం సాల్మన్ కనకం కోర్నెల్. ఉన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన స్వతంత్ర పోరాట ఉద్యమంలో ముందు వరసలో ఉన్న నాయకులు కమ్యూనిస్టులే అని గుర్తు చేశారు.దేశంలోని పలు రాష్ట్రాలలో వెట్టిచాకిరి విధానానికి స్వస్తి చెప్పే ఉద్యమాలతో పాటు ప్రత్యక్ష దోపిడి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలతో పాటు ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ సంస్థానంలో వెట్టి చాకిరి దోపిడీ అణిచివేతకు బానిసత్వానికి వ్యతిరేకంగా నిజాం భూస్వామ్య వ్యతిరేక పోరాటం నిర్మించి నిరంతర ఉద్యమాన్ని కొనసాగించిన మహనీయులు కమ్యూనిస్టులు అన్నారు. సాయుధ పోరాటం గెరిల్లా యుద్దానికి నాయకత్వం వహించిన సిపిఐ పార్టీ వల్లనే తెలంగాణలో అణగారిన కులాల వర్గాల విముక్తి అయిందని వారు పేర్కొన్నారు. సంపూర్ణ స్వరాజ్యం పిలుపునిచ్చిన సిపిఐ పార్టీ దేశంలో పేద ప్రజల కోసమే నిరంతరం కృషి చేస్తుందన్నారు ఇది గమనించిన సామాజిక ఉద్యమకారులు. తెలంగాణ మలిదశ ఉద్యమకారులు సిపిఐ పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమం కొనసాగిస్తామని వారు తెలిపారు.

# ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి జాగ్రత్తలు తీసుకోవాలి



**నల్లబెల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

రోజురోజుకు ఉష్ణోగ్రతలు అత్యధికంగా పెరుగు తుం డడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లబెల్లి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యులు పిబి ఆచార్య కోరారు. సోమవారం మాట్లాడుతూ వేసవి కాలంలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో ముఖ్యంగా వృద్ధులకు చిన్నారులకు బానుడి ప్రతాపం పడకుండా చూసుకోవాలన్నారు సాధ్యమైనంత వరకు బయటకి వెళ్లాలనుకునే వ్యక్తులు ఉదయం 10 గంటల లోపు వెళ్లి తమ పనులను ముగించుకొని ఇల్లు చేరుకోవాలని అన్నారు. అదేవిధంగా సాయంత్రం ఐదు గంటలకు ఎండ తీవ్రత తగ్గిన అనంతరం బయటికి వెళ్లి తిరిగి ఇల్లు చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం వేళ ఇంట్లోనే నీడ పట్టిన ఉండి వడదెబ్బకు గురికాకుండా వైద్య సిబ్బంది సూచించిన సలహాలను పాటించాలని ఆయన కోరారు. వడదెబ్బకు గురైన డయేరియా లాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి తగు వైద్యాన్ని చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఈ వేసవికా లంలో సాధ్యమై నంత వరకు మసాలా,మాంసాహారాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవ డం తగ్గించి ఓఆర్ఎస్ తో ఎా టు ం వ ం డ్ల రసాలను ఎక్కువ శాతం నీటిని సేవించి సాత్విక ఆహారం భుజించి శరీరానికి ధరించే దుస్తులు కాటన్ కు సంబంధించిన దుస్తులను మాత్రమే ధరించాల న్నారు. తరచూ ఓ ఆర్ ఎస్ ద్రావణంతో పాటు ఎక్కువ మంచినీటిని సేవించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది సూచించే సలహాలను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆయన మండల ప్రజలను కోరారు.

# నూతన వధూవరులను ఆశీర్వాదించిన పిసిసి సభ్యులు



**నెక్కొండ,ఏప్రిల్ 20,ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు కుమార్తె నిచ్చితర్ధ వేడుకకీ హాజరై కాబోయే నూతన వధూవరులను పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ ఆశీర్వాదించారు.సోమవారం నెక్కొండ పట్టణంలో వాసవి ఫంక్షన్ హాల్ లో జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు లక్ష్మీ దంపతుల కుమార్తె నీచ్చితర్ధ వేడుకకీ హాజరై కాబోయే నూతన వదువరులను నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఆవుల శ్రీనివాస్, కొనిజెటి బిక్షపతి, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ,కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివకుమార్, ఉపసర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, చల్లా శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్స్ రావుల మహిపాల్ రెడ్డి, తాల్లూరి న ి రి స ం ఎ ి శ స్వామిమాజీ,సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు దుడిమెట్ల రాజు, చల్లా రాగోతం రెడ్డి,గరికపాటి కృష్ణ రావు, మూసినా శ్రీనివాస్, మైనారిటీ నాయకులు షైక్ షబ్బీర్, మహ్మద్ అన్వర్,సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, వార్డ్ సభ్యులు రామరాపు శిరీష రాము,జెండా రవి మోటం మోనిక కృష్ణ రాజు, యాట శ్రావణి వినీత్,ఇదునూరి ప్రభాకర్,వజ్రాల శేఖర్ రెడ్డి, మెట్టు నర్సింహా రెడ్డి, వజ్రాల వెంకట్ రెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, ముప్వా వెంకటేష్ రెడ్డి, కొల్లి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# సొంత ఇంటి కలలు నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**నల్లబెల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ప్రతి పేదవారి సొంత ఇంటి కలలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండలంలోని కొండాపూర్ గ్రామ సర్పంచ్ అబ్బరబోయిన లలిత సురేష్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ గ్రామానికి చెందిన ధరావత్ బద్రి రాములు దంపతులకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా దానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండా వెంకటనారాయణ చేతుల మీదుగా సర్పంచ్ లలిత సురేష్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వారు గుర్తు చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అందజేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తడక పృథ్వీరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాటసారుల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

**నెక్కొండ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



ఎండతాపంలో బాటసారుల, ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హై స్కూల్ ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రంని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, నెక్కొండ పంచాయతీ సెక్రటరీ దయ్యాలా సదానందం, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఆవుల శ్రీనివాస్, కొనిజెటి బిక్షపతి, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివకుమార్, ఉపసర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, చల్లా శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్స్ రావుల మహిపాల్ రెడ్డి, తాల్లూరి నర్సింహా స్వామి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు దుడిమెట్ల రాజు, చల్లా రాగోతం రెడ్డి, గరికపాటి కృష్ణ రావు, మూసినా శ్రీనివాస్, మైనారిటీ నాయకులు షైక్ షబ్బీర్, మహ్మద్ అన్వర్, రావుల భాస్కర్ రెడ్డి, వార్డ్ సభ్యులు రామరాపు, శిరీష, రాము, చల్ల విష్ణు రెడ్డి, ముద్రబోయిన శ్రీకాంత్, దేవానబోయిన, విజేందర్ కందిక ఉమా వెంకన్న, జెండా రవి, మోటం మోనిక, కృష్ణ రాజు, యాట శ్రావణి, వినీత్, కొత్తకొండ గణేష్, చల్లా కిషన్ రెడ్డి, ఇదునూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

# కలకలం రేపిన బాల్య వివాహం

**చెన్నారావుపేట,ఏప్రిల్, 20, ప్రభాతవార్త**

మండలంలోని ఓ తండాలో బాల్య వివాహం విషయం కలకలం రేగింది.ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాసిన అమ్మాయికి అదే తండాకి చెందిన ఓ యువకుడితో వివాహం నిశ్చయించారు.రెండు రోజుల్లో జరగబో తున్న వివాహనికి సంబందించిన వివాహ ఆహ్వాన పత్రికలు పంచడం ,ఇరువురి ఇండ్ల దగ్గర పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న తండా అంగన్వాడీ సెంటర్ సెక్టర్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ వాసంతి ,చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి కల్పనలు చెన్నారావుపేట పోలీసుల సహకారంతో సోమవారం తండాకు చేరుకుని విచారణ చేపట్టారు.అనంతరం బాలిక తల్లిదండ్రులు,యువకుడి కుటుంబ సభ్యులను బాలల సంక్షేమ కమిటీకి అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

# ప్రమాదాల నివారణ ప్రధమ లక్ష్యం
# క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కావ్య

హసన్ పర్తి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త.

హసన్‌పర్తి 66వ డివిజన్ ప్రజల చిరకాల కోరిక అయిన రోడ్డు వెడల్పు, ఆధునిక సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పెద్ద చెరువు మూల మలుపు వద్ద తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చొరవతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు తెలిపారు. సుమారు రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టిన ఈ పనులకు ఇటీవల ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన చేయగా, నేడు వరంగల్ ఎంపీ శ్రీమతి కడియం కావ్య , కూడా చైర్మన్ శ్రీ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సోమవారం సంబంధిత అధికారులతో కలిసి జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూప్రజల ప్రాణ భద్రతే తమ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా హసన్‌పర్తి పెద్ద చెరువు మలుపు వద్ద గత రెండేళ్లుగా అనేక రోడ్డు ప్రమాదాలు



చోటుచేసుకుని విద్యార్థులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులను అత్యవసరంగా చేపట్టినట్లు తెలిపారు. "ఇకపై ఒక్క ప్రాణం కూడా రోడ్డు ప్రమాదాల్లో కోల్పోకూడదనే సంకల్పంతో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో ప్రయాణికులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించేందుకు సెంటర్ లైటింగ్ ఎంతో కీలకమని, ప్రమాదాల శాతం గణనీయంగా తగ్గడమే కాకుండా ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో నగర సౌందర్యం కూడా మరింత పెరుగుతుందని తెలిపారు. హసన్‌పర్తిలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా రోడ్లు, లైటింగ్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దశలవారీగా ప్రతి ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి పనులు కొనసాగుతాయని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో 66వ డివిజన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని పేర్కొన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి పథం లక్ష్యంతో ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేస్తోంది. ఎక్కడా వెనుకబాటు లేకుండా ప్రతి డివిజన్‌కు సమాన న్యాయం జరుగుతుంది" అని ఎమ్మెల్యే నాగరాజు గారు తెలిపారు. రోడ్డు వెడల్పు మరియు సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు... జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీ పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, స్థానిక డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు గొర్రె కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, విజయ్, పెద్దమ్మ నరసింహా రాములు , వెంకటస్వామి బిగుల్ల సురేష్, గరిగే రాజు పలువురు నాయకులు కార్యకర్తలు , అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లుతో సొంతంటే కల నెరవేరుతుంది

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్ పర్తి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ ఫలితాలను ప్రజల గడపకు చేరుస్తూ మరో మైలురాయిని చేరుకుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపాడు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం హసన్ పర్తి మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు గోపరాజు సుగుణమ్మ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇంటి నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేయడం సంతోషదాయకమని అన్నాడు. నూతన గృహ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ శ్రీ కడియం కావ్య , కూడా చైర్మన్ శ్రీ ఇనుగాల వెంకట్రామిరెడ్డి , హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లబ్ధిదారు కుటుంబానికి బట్టలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, అభివృద్ధితో జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఒక పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది" అని తెలిపారు. "ఇందిరమ్మ ఇళ్ల పథకం తో మధ్యతరగతి కుటుంబాలకు సొంత



గృహం కల్పించడం ప్రభుత్వం ముఖ్య సంకల్పం. సుగుణమ్మ ప్రభుత్వ మంజూరుతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడం ఈ పథకం విజయానికి నిదర్శనం" అని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో!!!జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తేనేళ్లపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు ఎర్రకొండ శ్రీనివాస్, గొర్రె కిరణ్, పెద్దమ్మ నరసింహ రాములు , కనపర్తి కిరణ్ , సురేందర్ రెడ్డి , గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ, గ్రామ నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# హామీలను నెరవేరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్న యువ సర్పంచ్

## మాట ఇచ్చాడు.. నిలబెట్టుకుంటున్నాడు
## లక్ష్మీపురం సర్పంచ్ కొడగని రాజేష్

కమలాపూర్: ప్రభాతవార్త.

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం లక్ష్మీపురం గ్రామానికి యువ సర్పంచ్ కొడగని రాజేష్ రూపంలో కొత్త ఊపిరి వచ్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఇతర సర్పంచులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. యువకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే పాలన ఎలా ఉంటుందో చేసి చూపిస్తున్నాడు.సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన మాటను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటూ గ్రామ ప్రజల మన్ననలు పొందుతున్నాడు. పదవి అనేది హోదా కాదు బాధ్యత అని తన పనులతో నిరూపిస్తున్నాడు. యువ రక్తం పాలనా పగ్గాలు చేపడితే గ్రామ స్వరూపమే మారిపోతుందని లక్ష్మీపురం గ్రామాన్ని చూస్తే అర్థమవుతుంది.గ్రామంలో ఆడబిడ్డ పెళ్లికి 5016 రూపాయల ఆర్థిక సాయం



అందించి తన పెద్ద మనసును చాటుకున్నాడు. కష్టంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం నాయకుడి లక్షణమని చాటాడు. అంతేకాకుండా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం 2 లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి రేకుల షెడ్డు నిర్మించాడు. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడగడం కాదు, దేవుడి గుడికి సేవ చేయడం గొప్ప అని నిరూపించాడు. అభివృద్ధి విషయంలోనూ ముందున్నాడు. గ్రామంలో 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశాడు. ఏళ్ల తరబడి బురద రోడ్లతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాడు. అభివృద్ధి అంటే హంగులు, ఆర్భాటాలు కాదు, ప్రజలకు అవసరమైన పనులు చేయడమేనని ఆచరణలో చూపుతున్నాడు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి పని చేద్దామని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామం బాగుపడాలంటే రాజకీయాలు పక్కన పెట్టాలనే సందేశాన్ని ఇస్తున్నాడు. కులం, మతం, పార్టీ చూడకుండా అందరినీ కలుపుకొని పోవడమే అసలైన నాయకత్వమని నిరూపిస్తున్నాడు.యువ సర్పంచ్ చేస్తున్న పనులకు మండల అధికారులు సైతం అభినందనలు తెలుపుతున్నారు. నిధులను సక్రమంగా వినియోగిస్తూ పారదర్శక పాలన అందిస్తున్న తీరును అధికారులు కొనియాడుతున్నారు. ఇలాంటి యువ నాయకులు ఉంటే పల్లెల రూపురేఖలు మారిపోతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీపురం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి కొడగని రాజేష్ నిబద్ధతే నిదర్శనం.

జయశంకర్ వార్త
భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

# ఫ్లెక్సీ షాపును ప్రారంభించిన సర్పంచ్ తౌటం లక్ష్మి

## యజమాని దంపతులకు ఘన సన్మానం

చిట్యాల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త;



మండల కేంద్రంలో ని తిరుమల ఫోటో స్టూడియో లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ షాపును స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య సోమవారం ప్రారంభించారు. తిరుమల స్టూడియో యజమాని సంజీవ్ ఫ్లెక్సీ షాపును మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మండల కేంద్ర ప్రజలకు ఫ్లెక్సీ సౌకర్యం అందుబాటులోకి తెచ్చిన సందర్భంగా సంజీవ్ ను స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మి, వార్డు సభ్యుడు తౌటం నవీన్, నవాబుపేట మాజీ సర్పంచ్ కసిరెడ్డి సాయి సుధా రత్నాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చెక్క నరసయ్య లు శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు కొక్కుల రాములు, బిజెపి, బిఆర్ఎస్ , కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

చిట్యాల, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు సివిల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపించేశారు. ఆస్పత్రి సూపరింటెంట్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు డాక్టర్ పొనగంటి మనోజ్, నర్సింగ్ ఐసిఎన్ అధికారిని శిరీష ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కూలీలు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకే పని చేయాలని, సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు మాత్రమే పని చేయాలని పేర్కొన్నారు.తలపై టవలు కట్టుకోవాలని, ఎక్కువ మోతాదులో వాటర్ తాగాలని, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం. తీసుకోవాలని.కిరాణం షాపులో మెడికల్ షాప్ లో డబ్బాలో దొరికే ఓ ఆర్ ఎస్ కాకుండా ప్యాకెట్ లో వచ్చే ఓఆర్ఎస్ వాడాలని చెప్పారు .ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది కట్కూరి నరేందర్. కిరణ్. కారోబార్ సదానందం తదితరులు పాల్గొన్నారు

# సాయి పేటలో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

ధర్మసాగర్ ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సాయి పేట గ్రామంలో సోమవారం బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,బసవేశ్వరుని జయంతి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో వీరశైవ జంగమ మహేశ్వరులు జోగాల నాగేంద్రం, శిలమంతల రాజయ్య, బక్కెర ప్రవీణ్, బక్కెర రాజయ్య, బక్కెర శంకరయ్య, కనుకటి సారంగపాణి, బక్కెర మహేందర్, బక్కెర రాజేందర్ పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఆదాలి లక్ష్మీ నాగరాజ్, ఉప సర్పంచ్ జోగాల రాజేందర్,వార్డు సభ్యులు జోగాల జ్యోతి తదితరులు హాజరయ్యారు.తదనంతరం ఉపాధి హామీ కూలీలకు స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య జరిగింది.

# ఉపాధి కూలీలకు న్యాయం చేయాలి

మరిపెడ,ఏప్రిల్20,ప్రభాతవార్త:

ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని సిపిఎం నాయకులు నందిపాటి వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామం కొమ్ముగుంట రాళ్ల సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ గ్రామంలో సుమారు 1200మంది ఉపాధి కూలీలు ఉన్నారని, వారు గత తొమ్మిది వారాలుగా పనిచేస్తున్నప్పటికీ వేతనాలు అందలేదని, పనిప్రదేశం దూరం ఉన్నా ఎండలో



నడుచుకుంటూ వెళ్లి పనులు చేస్తున్నారని వారి వేతనాలు ఇప్పటి వరకు చెల్లించకపోవడం బాధాకరం అన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అదేవిదంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం పేరు మార్పు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో కూలీలకు డబ్బులు చెల్లించని యెడల ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్న లచ్చయ్య, వార్డు సభ్యులు ఉప్పలమ్మ, ఉపేందర్, అంబేద్కర్ సంఘం యువజన అధ్యక్షులు ప్రమోద్, కూలీలు రాములు, బాలకృష్ణ, మహేష్, ఎల్లయ్య, సోమయ్య, వెంకన్న, ఎల్లమ్మ, మాధవి, ధనమ్మ, సుభద్ర, రాధ, మైసమ్మ, ఉప్పలమ్మ, లక్ష్మి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి వెల్ఫేర్ వీక్ తోడ్పాటు

మరిపెడ,ఏప్రిల్20,ప్రభాతవార్త:



ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్ఫేర్ వెల్ఫేర్ వీక్ కార్యక్రమాన్ని సోమవారం మరిపెడ మినీ గురుకులం పాఠశాలలో హెడ్‌మాస్టర్ మైతిలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత లక్ష్యాలను సాదించాలన్నారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ బసవేశ్వర జయంతి

మహబూబాబాద్ టౌన్,ఏప్రిల్20,ప్రభాతవార్త:



అక్షయ తృతీయను పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల ఆధ్వర్యంలో మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధనపు కలెక్టర్ అనిల్‌కుమార్ బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బసవేశ్వర లింగాయుత సాంప్రదాయ స్థాపకుడని, సమానత్వం, న్యాయం, భక్తికి బలమైన ప్రతిపాదకుడని తెలిపారు. జిల్లా అధికారి శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను కలసిన డాక్టర్ వీరన్ననాయక్

మహబూబాబాద్ టౌన్,ఏప్రిల్20,ప్రభాతవార్త:

పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను సోమవారం మహబూబాబాద్ జిల్లాకు చెందిన టీపీసీసీ హెల్త్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ వీరన్ననాయక్, వ్యవసాయ శాస్త్రవేత్త రమేష్‌నాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వవైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపు కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ ప్రజా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు తెలిపారు.



## అంగన్వాడి కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు పునాది

మరిపెడ,ఏప్రిల్20,ప్రభాతవార్త:



అంగన్వాడి కేంద్రాల పిల్లల భవిష్యత్తుకు పునాదిలాంటివని మరిపెడ ఎసీడీపీఓ తేజ కళ్యాణి తెలిపారు. సోమవారం మున్సిపాలిటి పరిధిలోని బ్యాంకుకాలనీ అంగన్వాడి కేంద్రంలో రాముతండా, సేవానగర్, గ్యామతండా, హౌసింగ్‌బోర్డు, మైనార్టీ కాలనీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ పక్షవాడ కార్యక్రమంలో భాగంగా ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తేజ కళ్యాణి మాట్లాడుతూ చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, వారి భవిష్యత్తుకు బలమైన అడుగులని పెర్కొన్నారు. అంగన్వాడి కేంద్రంలో నేర్చుకునే ప్రాథమిక విద్య, అలవాట్లు తర్వాతి విద్యభ్యాసంలో ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాములు, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ పూజిత, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, అంగన్వాడి టీచర్లు శ్రిమతి, రజిని, శారధ, విజయలక్ష్మి, ఉమారాణి, హాలీమా, హెల్పర్లు మాధవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ రూరల్,ఏప్రిల్20,ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని కరోనా సమయంలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా నిర్మించిన జిల్లాలోని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆక్సిజన్ ప్లాంట్ వద్ద టిడిపి పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచందర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న నాయక్‌తో కలసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో అధికారంలో లేకున్నా గిరిజన ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.50లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్ మంజూరు చేసి ప్రారంభించారని తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో కలకాలం సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. భూక్య సునితమంగిలాల్, సుతారపు వెంకటనారాయణ, ప్రేమ్‌చంద్ వ్యాస్, హరికిషన్, శ్రీను, నరేందర్, సాంబయ్య, సాయి, సదానందం, శంకర్, సంపత్ పాల్గొన్నారు.







## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**-జిల్లా స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో**

చిన్నగూడూరు,ఏప్రిల్20,ప్రభాతవార్త:



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పొ అన్నారు. సోమవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. వంటశాలను సందర్శించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నారు. జెసి వెంట ఇంచార్జ్ ఎంపీడీవో రజిని, గ్రామ సర్పంచ్ బత్తెం రమేష్, వార్డు సభ్యులు జీనక శేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మేరా భవాని మాత వేడుకలు

బయ్యారం,ఏప్రిల్20,ప్రభాతవార్త:



బయ్యారం మండలం వెంకట్రాంపురం పంచాయతీ పరిధిలో శోక్లతండా గ్రామంలో సోమవారం లంబాడ కులస్థులు మాలోతు ప్రభాకర్, మమత, పార్వతి దంపతులు తమ ఇష్టదైవం ప్రతి సంవత్సరం అక్షయ తదియ లక్ష్మి నరసింహ స్వామి ఇష్టమైన రోజు కృత్తిక నక్షత్రం హిందూవారం శ్రీ వెంకటేశ్వర స్వామి మేరా భవాని ఉత్సవ విగ్రహాలను పురోహితులు నవీన్ శర్మ సమక్షంలో గ్రామంలో ఊరేగింపు చేస్తూ ఉత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మండలంలోని నలుమూలల నుండి భారీ ఎత్తున భక్తులు తమ మొక్కులు చెల్లించుకొని ఇష్టదైవాన్ని కొలిచారు. ఉత్సవ విగ్రహాలను గ్రామం అంతటా పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో తేజావత్ రామచంద్రనాయక్ కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు రాందాస్‌నాయక్, రాజేష్ నాయక్, హరినాయక్, మంగిలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం స్థల పరిశీలన

బయ్యారం,ఏప్రిల్20,ప్రభాతవార్త:



బయ్యారం మండలం గంధంపల్లి- కొత్తపేట గ్రామంలో రైతఉలకు సౌకర్యవంతంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకై స్థలాన్ని పిఐసి ప్రత్యేక అధికారి శ్రీనుబాబు, సీఈఓ సురేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి సౌకర్యం, నిల్వ ఏర్పాట్లు, తేమ నుండి రక్షణ చర్యలు వంటి అంశాలను పరిశీలించారు. రైతులు తమ పంటలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునే విధంగా సౌకర్యం కల్పించాలని ఇంచార్జ్ చల్లా సురేష్, ఉదయ్ లకు సూచించారు. గంధంపల్లి, కొత్తపేట ప్రాంత రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరిశీలనలో కొనుగోలు కేంద్రం ఇంచార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్ ను సందర్శించిన ప్రత్యేక అధికారి

నెల్లికుదురు ఏప్రిల్ 20 ప్రభాతవార్త :
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో వెల్ఫేర్ వీక్ లో భాగంగా మండల ప్రత్యేక అధికారి మరియన్న స్థానిక ఎంఈఓ రామదాసుతో కలిసి



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో సందర్శించి కిచెన్, పరిశుభ్రము పరిశీలించారు అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సింగారపు కుమార్ తహసిల్దార్ చందా నరేష్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు వారం రోజుల కార్యక్రమం లో భాగంగా 2వ రోజు హాస్టల్ విద్యార్థుల టాలెంట్ ఫెస్ట్, 3వరోజు రెసిడెన్షియల్ స్కూలు హాస్టల్ లలో మైనర్ రిపేర్లు 4వ రోజు తల్లిదండ్రులు టీచర్ల సమావేశం 5వ రోజు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం 6వ రోజు స్పోర్ట్స్ గేమ్స్, ఆర్ట్, క్రాఫ్ట్, డిజిటల్ లైబ్రరీ, పర్సనాలిటీ డెవలప్మెంట్ 7వ రోజు బడిబాట కార్యక్రమం ఉంటుందన్నారు

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

నెల్లికుదురు ఏప్రిల్ 20 ప్రభాతవార్త :
మండలంలోని వావిలాల గ్రామంలో రూ" 10 లక్షలతో నిర్మించ



తలపెట్టిన సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక సర్పంచ్ గోగుల మమత ప్రశాంత్ ప్రారంభించారు అనంతరం ఆమె మాట్లాడారు అంతర్గత రోడ్ల ఏర్పాటు కొరకు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ సహకారంతో రోడ్లు వేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండెపాక ఎల్లమ్మ పంచాయతీ కార్యదర్శి బచ్చుల మధుకర్ వార్డు సభ్యులు గుండెపాక లలిత గుండెపాక సురేష్ నాయకులు గోగుల అశోక్, గోగుల నరేష్, యాకన్న, ఉమేష్, భూపాల్ రెడ్డి, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు

## కిట్లను పంపిణీ చేసిన తహసిల్దార్

నెల్లికుదురు ఏప్రిల్ 20 ప్రభాతవార్త :
జనాభా గణన ఎన్యుమరేటర్లకు అవసరమయ్యే కిట్లను సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో తహసిల్దార్ చందా నరేష్ వారికి అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 సెన్సెస్ లో భాగంగా ప్రభుత్వం అన్ని వర్యలు తీసుకుంటుందని జనాభా గణన దోషాలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు మంగళవారం నాటికి మొదటి దశ శిక్షణ పూర్తవుతుందని మిగిలిన వారికి రెండవ దశ శిక్షణ 23వ తేదీ నుంచి నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, జీపిఓ ఉప్పలయ్య, జూనియర్ అసిస్టెంట్ రవళి, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, సిబ్బంది నాగుల అనిల్, మద్ది రాజు , శీను, నరేష్, భీముడు తదితరులు ఉన్నారు



## రికార్డులు తనిఖీ చేసిన డిఎల్పీవో

నెల్లికుదురు ఏప్రిల్ 20 ప్రభాతవార్త :
మండలంలోని రామన్నగూడెం గ్రామపంచాయతీలో సోమవారం



తొర్రూరు డిఎల్పిఓ పుల్లారావు రికార్డులు తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై రికార్డులను పరిశీలించడం జరిగిందన్నారు ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీఓ పద్మ పంచాయతీ కార్యదర్శి హేమలత ఉన్నారు

## వసతి గృహాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నర్సింహులపేట,ఏప్రిల్20 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో సోమవారం పరిశీలించారు.ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా వసతి గృహాల్లో



మౌలిక వసతుల సదుపాయాలు,ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో చదువుతూ పరీక్షల్లో తప్పి సప్లమెంటరీకి సిద్ధమవుతున్న విద్యార్థులను పలకరించి మళ్ళీ బాగా రాయాలని కితాబిచ్చారు.పాఠశాలలోని కంప్యూటర్లు,ప్రయోగశాలల గదులను పరిశీలించారు.వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఏ ఏర్పాట్లు అవసరమని ఆరా తీశారు.ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీమన్నారాయణ,తహశీల్దార్ రమేష్ బాబు,ఎంపీడీవో రాధిక,మండల పంచాయతీ అధికారి కిన్నెర యాకయ్య,పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## బహుజన మహనీయుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### సిపిఎం జిల్లా నాయకులు గునిగంటి మోహన్ గౌడ్

నర్సింహుల పేట ఏప్రిల్ 20 ప్రభాతవార్త
ఈనెల 22వ తేదీన చిన్న గూడూరు మండలం గుండం రాజు పెల్లి గ్రామంలో ఒకే రోజు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏకలవ్య దివంగత గునుగంటి బుచ్చయ్య గౌడ్ విగ్రహాలు ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నందున ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు గునిగంటి మోహన్ గౌడ్ తెలిపారు సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహాలు ఆవిష్కరణ ద్వారా బహుజన ఐక్యత సామాజిక చైతన్యం ఆత్మగౌరవం మరింత బలపడుతుందని ఇట్టి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నిధుల దుర్వినియోగంపై వాట్సాప్ లో రచ్చ..

నర్సింహుల పేట ఏప్రిల్ 20 ప్రభాతవార్త
గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయని వాట్సాప్ వేదికగా ఓ పోస్టు వైరల్ గా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే పెద్దనాగారం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి ముగ్గురు కలిసి గ్రామంలో సుమారు 6లక్షల వరకు దుర్వినియోగం చేశారని ఆదివారం రచ్చ బండ వద్ద చర్చ జరిగిందని, గ్రామంలో గెలిచినా నుండి వార్డు సభ్యుల అంగీకారం లేకుండా సంబంధిత ఏఈ ఎంబి రికార్డు చేయకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని వాట్సాప్ పోస్టు వైరల్ గా మారి చక్కర్లు కొడుతోంది. దీనిపై ఎంపీడీవో కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోతామని రాసి గ్రూపుల్లో పోస్టు చేశారు.ఈ పోస్టు వైరల్ గా మారడంతో మండలంలో పలు గ్రామపంచాయతీలో తమ గ్రామాల్లో కూడా నిధులు ఇదేవిధంగా దుర్వినియోగం అయ్యాయేమో అని మండల వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలికి తీయాలని ప్రజలు కోరుతున్నారు.

# తొర్రూరు వార్త

## ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి తెలుసుకోవాలి సర్పంచ్ యాకయ్య

నర్సింహుల పేట ఏప్రిల్20 ప్రభాతవార్త
గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్య క్షేమాలను ఇంటింటా తిరిగి ప్రతిరోజు అడిగి తెలుసుకోవాలని గ్రామ



వైద్య సిబ్బందికి సర్పంచ్ పెదమాముల యాకయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం మలేరియా ఆర్డిటి కిట్టు టెస్టులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సంజీవరావు సూపర్వైజర్ బీమా నాయక్ అన్వేష్ ఆశాలు జ్యోతి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర క్షేత్ర పునర్నిర్మాణానికి అంకురార్పణ...

-రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన...

-రూ. 3.70 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం...

-ముక్తీశ్వరుని సన్నిధిలో మంత్రులతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన ముఖ్యమంత్రి...

మహదేవపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త
దక్షిణ కాశీగా పేరుగాంచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర-ముక్తీశ్వర స్వామి దేవాలయం నూతన శోభను సంతరించుకోనుంది. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కేటాయించిన రూ. 198 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పునర్ అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. వీటితో పాటు భక్తుల సౌకర్యార్థం రూ. 3.70 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన బస్టాండ్ పనులకు కూడా ఆయన భూమిపూజ చేశారు.

**-భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం...**

కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శుభానంద దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎంకు వేదాశీర్వచనం అందించగా, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమీషనర్ హనుమంతరావు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక పర్యాటక రంగంలో కాళేశ్వరానికి పూర్వ వైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వివేక్, ఎంపీలు వేంరెడ్డి నరేందర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఎంజెపి గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

*గూడూరు, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

మండలంలోని మద్రిమిట్ట శివారులో నిర్వహిస్తున్న గుమ్మడూరు జ్యోతిరావుపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ సోమవారం సందర్శించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి సంక్షేమ వారోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో కలెక్టర్ ఈ గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గురుకులం పరిసరాలను, వసతిగృహంలోని స్టోర్‌రూం, కిచెన్, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారికందుతున్న విద్యాబోధన, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నభోజనం చేసి భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హిమవతితో మాట్లాడి పలు సూచనలు చేసారు. గురుకులంలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలని, డైట్ మెనూ ప్రకారం అందించాలని, ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూసుకోవాలని, భోజనం తయారు చేసే సిబ్బందికి షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు చేయించాలని, విద్యార్థినులకు క్రీడలు, మానసిక వికాసానికి సంబంధించి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ పనులన్నీ ఈ సంక్షేమ వారోత్సవాల్లో ప్రత్యేకంగా చేయాలన్నారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఎఐ డిజిటల్ తరగతుల ద్వారా వినూత్న రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ నాగభవాని, ఎంపిడిఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



## 27 నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు

*గూడూరు, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

గూడూరులోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుండి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను సోమవారం ఆలయ ప్రాంగణంలో



ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల నిర్వహణ ఆనవాయితీలో భాగంగా ఈ సంవత్సరం కూడా వైశాఖ శుద్ధ ఏకాదశి (27వ తేదీ) మొదలు వైశాఖ బహుళ విదియ (మే-3) వరకు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మే 1న స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోతు సునితాకొమ్మాలునాయక్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పింగిలి శ్రీనివాస్, అర్చకులు వేణుగోపాలచార్యులు, మేర్గు నరేష్, మేర్గు మల్లయ్య, సమ్మెట సుధాకర్, మడిపెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్వీయ గణనపై కూడా అవగాహన కలిగించాలి

*గూడూరు, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

జాతీయ జనాభా గణన కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో పౌరులు అందించే స్వీయ గణన వివరాల గురించి కూడా ఎన్యుమరేటర్లు వారికి అవగాహన కలిగించి నిర్దేశిత వివరాలను పొందుపరిచే విధంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ కోరారు. గూడూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో జనగణన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ సోమవారం సందర్శించి శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. శిక్షణ పొందుతున్న ఎన్యుమరేటర్లతో మాట్లాడి వారు తెలుసుకుంటున్న విశయాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణ సమయంలో ఎన్యుమరేటర్లు తమకు ఎలాంటి సందేహాలు ఉన్నా అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. యాప్‌ను ఎలా ఉపయోగించే విధానంపై ఎన్యుమరేటర్లకు ఉన్న అవగాహనపై స్వయంగా పరిశీలించారు. శిక్షణా శిబిరంలో మాస్టర్ ట్రైనర్స్ ఎన్యుమరేటర్లకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. మండలంలో జనగణనను విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ నాగభవాని, ఎంపిడిఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



## విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

*గూడూరు, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 30న హైదరాబాద్‌లోని సుందరయ్య



విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సదస్సు వాల్‌పోస్టర్లను సోమవారం ఆ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్లతో పాటు కరపత్రాలను కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇంచార్జి హెచ్ఎం సదాశివ, టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు ఆదినారాయణ, నర్సయ్య, వెంకటేశ్వర్లు, నవీన్, అనూష, సంధ్యారాణి పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

*గూడూరు, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

మండలంలోని పొనుగోడు గ్రామంలోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి ఉంచిన 6.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు. పొనుగోడు గ్రామానికి చెందిన మేడి మల్లేశం అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బానోతు బుజ్జి ఇంటి ముందు ఉన్న పాత షెడ్డులో రేషన్ బియ్యం అక్రమంగా దాచి ఉంచినట్లు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి బియ్యం స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించడం జరిగిందని, ఇందుకు బాధ్యుడైన మల్లేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారు

*కేసముద్రం, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు చీకటి వెంకట్రాం నరసయ్య వలువురికి మార్గదర్శకంగా నిలిచారని అటవీశాఖ భద్రాచలం సర్కిల్ వరంగల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డి ఎఫ్ ఓ ఏసల్ల అప్పయ్య అన్నారు. కేసముద్రం విలేజ్ జడ్పీ హైస్కూల్లో బయాలజీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న చీకటి వెంకట్రాం నరసయ్య ఉద్యోగ విరమణ అభినందన సభ సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎఫ్ఓ మాట్లాడుతూ విద్యార్థులకు 40 సంవత్సరాలుగా విద్యాబోధన అందించడం ఎంతో గర్వకారణమని, తాను కూడా ఆయన శిష్యుడినేనన్నారు. చదువులోనే కాకుండా నాటక రంగంలో ఎన్నో విభిన్నమైన పాత్రలతో ప్రజలను మెప్పించారని అన్నారు. అనంతరం వెంకట్రాం నరసయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నూకల వెంకన్న ఏసల్ల జ్యోతి శ్రీ రామోజీ మహేశ్వర చారి ఆవుల యుగేందర్ వీరబోయిన సుమన్ ఏ సల్ల భీరయ్య ఏ సల్ల సత్యనారాయణ మద్ది దేవేందర్ చాగంటి శ్రీను ఏర్పుల వెంకన్న అశోక్ మురళి లింగస్వామి పాల్గొన్నారు.






## కాళేశ్వరం ప్రాజెక్టులపై కేంద్రం ఎందుకు మౌనంగా ఉంది..?

**-కనీసం లక్ష ఎకరాలకు కూడా నీళ్లివ్వని కాళేశ్వరం..**

**-దోషులను వదిలే ప్రసక్తే లేదని హెచ్చరిక**

**-ఎన్నికల కోసం నిజాలను దాచాలని చూసినా..ప్రకృతి వాస్తవాలను బయటపెట్టింది**

**-ప్రాజెక్టుకు రిపేర్లు చేపించి రైతులకు నీరందిస్తాం...**

**-మేడిగడ్డ సమావేశంలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి**

**-నిజాలు ప్రజలకు తెలియకూడదనే కేసీఆర్ సమావేశం...**

*మహదేవపూర్, ఏప్రిల్ 20, (ప్రభాతవార్త)*

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం భారీ దోపిడీకి పాల్పడిందని, ఈ కుంభకోణంలో దోషులు ఎంతటి వారైనా శిక్షించి తీరుతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి అధికారులతో సమీక్ష జరిపిన తర్వాత మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ నుంచి మేడిగడ్డ కుప్పకూలే వరకు జరిగిన పరిణామాలపై అగ్నిపరీక్ష లాంటి విమర్శలు చేశారు. 1975లో జలగం వెంగళరావు హయాంలోనే గోదావరి జలాల వినియోగంపై మహారాష్ట్రతో ఒప్పందం13 జరిగిందని రేవంత్ గుర్తు చేశారు. 2009లో వైఎస్సార్ హయాంలో రూ.38,063 కోట్లతో మొదలైన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును, కేసీఆర్ ప్రభుత్వం కేవలం ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం 'కాళేశ్వరం'గా రీడిజైన్ చేసిందని మండిపడ్డారు. అంచనాలను ఏకంగా రూ.1.50 లక్షల కోట్లకు పెంచి, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. 2018 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు అద్భుతమంటూ భ్రమలు కల్పించారు. కానీ 2023లో మేడిగడ్డ కుప్పకూలడంతో వీరి పాపం పండింది. ఎన్నికల కోసమే నిజాలను దాచాలని చూసినా, ప్రకృతి వాస్తవాలను బయటపెట్టింది' అని సీఎం అన్నారు. నవంబర్ 2023లో ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్ రావు రహస్యంగా ఢిల్లీ పర్యటించడంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విచారణ నుంచి తప్పించుకోవడానికి బీజేపీ నేతల కాళ్లు పట్టుకోవడానికే హరీశ్ ఢిల్లీ వెళ్లారు. అక్కడ ఎవరెవరిని కలిశారో తెలంగాణ ప్రజలకు చెప్పాలి. న్యాయవాదులను కలవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందంతో ఉన్నాయని, అందుకే తాము పదే పదే లేఖలు రాసినా సీబీఐ విచారణపై కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. రైతులకు నీరు కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు కనీసం లక్ష ఎకరాలకు కూడా కొత్తగా నీరు ఇవ్వలేకపోయారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. నిజానికి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వల్లే రాష్ట్రంలో పంటలు పండుతున్నాయని, అది హరీశ్ రావుకు రాజకీయం తెలియకముందే ఉందన్నారు. ప్రభుత్వం త్వరలోనే నిపుణుల సలహాతో కాళేశ్వరం ప్రాజెక్టుకు రిపేర్లు చేయించి రైతులకు నీరందిస్తుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వంశీకృష్ణ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.



# చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు

**-రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**-ఆదర్శలో వైభవంగా 36వ వార్షికోత్సవ వేడుకలు**



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన 36వ వార్షికోత్సవ, గ్రాడ్యుయేషన్ ఫెస్ట్, కల్చరల్ కార్నివాల్ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. 36ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలో ఆదర్శ విద్యా సంస్థ అందిస్తున్న సేవలను అభినందించి, పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినీలు

ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బాల్యంలోనే మంచి విద్య, విలువలు అలవాటు పడితే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానం అందించాల న్నారు. కాటారంలో ప్రభుత్వ విద్యాలయాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పంతకాని తిర్మల-సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు దబ్బెట రాజేష్, పసుల మొగిలి, కొట్టె శ్రీహరి, ప్రభాకర్, మల్లయ్య, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చిన్నారికి అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## ప్రభుత్వ పాఠశాలలో మంత్రి పర్యటన

కాటారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

కాటారం మండలం దేవరంపల్లి ప్రభుత్వ పాఠశాలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆకస్మిక తనిఖీ చేశారు.

**-విద్యార్థులతో సరదా ముచ్చట్లు...**

పాఠశాల విద్యార్థులతో పాఠం చెప్పించి సరదాగా ముచ్చటించారు. చిన్నారులతో ఉల్లాసంగా గడిపిన ఈ సమయంలో మంత్రి శ్రీధర్ బాబు విద్యా విధానాల గురించి కూడా చర్చించారు.

**-బాల్య విద్యలో మంచి విలువలు అవసరం..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బాల్యంలోనే మంచి విద్య, విలువలు అలవాటు పడితే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాలని సూచించారు.

**-ఆధునిక విద్య, కాటారం ఎడ్యుకేషన్ హబ్**

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానం అందించాలన్నారు. కాటారంలో ప్రభుత్వ విద్యాలయాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దారని తెలిపారు.

**-మరుగుదొడ్ల నిర్మాణానికి హామీ...**

అనంతరం పాఠశాలలో మరుగుదొడ్లను వెంటనే నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులతో సరదాగా ముచ్చటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## పుస్తకాలు ముందు తరాలకు జ్ఞాపికలు

ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చరిత్ర విభాగానికి చెందిన తాత్కాలిక అధ్యాపకుడు డాక్టర్ ఆరూరి రంజిత్ రచించిన"ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం 1956 నుండి 2014 వరకు" అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ పుస్తకాలు సమాజానికి జ్ఞాన సంపదగా నిలుస్తాయని, భవిష్యత్ తరాలకు అవి చిరస్మరణీయ జ్ఞాపికలుగా మారుతాయని తెలిపారు. డాక్టర్ ఆరూరి రంజిత్ రచించిన ఈ గ్రంథం 1956 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యావిధాన పరిణామాలను సమగ్రంగా ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, డాక్టర్ బిక్షపతి, డాక్టర్ ఆర్.ఆదిరెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ చందూలాల్, పుస్తక రచయిత డాక్టర్ ఆరూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో కార్యదర్శి పై కలెక్టర్ కు ఫిర్యాదు

భీమదేవరపల్లి: ఏప్రిల్ 20 (ప్రభాత వార్త)



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముస్తఫాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పై హనుమకొండ జిల్లా కలెక్టర్ కి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం విధులు పట్ల నిర్లక్ష్యం ,గ్రామానికి వచ్చిన నిధుల అవకతవకలపై అధికార దుర్వినియోగం పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నామని తెలిపారు. కార్యదర్శి పై జిల్లాస్థాయి అధికారిచే పూర్తి విచారణ చేయాలని కలెక్టర్ ను విన్నవించారు. ఇట్టి కార్యక్రమంలో కడారి శ్రీనివాస్, మాడుగుల సంపత్ కుమార్, గద్దం రఘుపతి రెడ్డి, సట్ల శ్రీనివాస్, ఏనుగు విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుదనపల్లి గ్రామం ఆదర్శంగా నిలువాలి

**-జిల్లా ఎస్పీ శబరీష్**

మహబూబాబాద్ రూరల్,ఏప్రిల్20,ప్రభాతవార్త:



మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం సుదనపల్లి గ్రామం రోడ్డుభద్రతకై హెల్మెట్ వాడకం, గ్రామ రక్షణకై సీసీ కెమెరాల ఏర్పాటు, గంజాయి నిర్మూలనతో యువత శ్రేయస్సుకు ప్రతీకగా నిలువనుందని జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సుదనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని హెల్మెట్ ధరించి గ్రామంలో బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదనపల్లిని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, గంజాయి వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించి గ్రామాన్ని వ్యసన రహిత గ్రామంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ నీలం వెంకన్న ఉచితంగా 150హెల్మెట్‌లు పంపిణీ చేయడం, సైకిల్ వినియోగదారులకు రేడియం స్టిక్కర్లు, స్కూల్ పిల్లలకు క్రీడాసామగ్రి పంపిణీ చేయడం పట్ల ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి కృష్ణ కిషోర్, సీఐ పవన్‌కుమార్, ఎస్సై సంతోష్, ఉప సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం

**-ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేరి ప్రభాకర్**

**-మహముత్తారంలో విద్యార్థులకు హెల్త్ కార్డుల పంపిణీ**

మహముత్తారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేరి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రఫీ ఆర్థిక సహకారంతో, నవీన్ నాయక్ ప్రత్యేక కృషితో సుమారు 90 మంది విద్యార్థులకు ఈ హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, వారికి అండగా నిలిచేందుకు హెల్త్ కార్డులు అందజేయడం సంతోషకరమని పేర్కొన్నారు. డాక్టర్ రఫీ, నవీన్ నాయక్ వంటి వారు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్డుల ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఏ.తిరుపతి, ఎం.కవిత, ఎస్.అపర్ణ, ఏ.శారద, బి. శ్యామల తదితరులు పాల్గొని విద్యార్థులకు కార్డులను పంపిణీ చేశారు.

## దేవసేన కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :



కాకతీయ యూనివర్సిటీలో ఉన్నటువంటి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం యూనివర్సిటీకి వచ్చిన టెక్నికల్ కాలేజీల కమిషనర్ ఐఏఎస్ దేవసేన కి ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.